
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 22 నవంబరు 2024



భద్రాద్రి జిల్లా జడ్పీ సీఈవోగా నాగలక్ష్మి



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా విధులు నిర్వహిస్తున్న నాగలక్ష్మి భద్రాద్రి జిల్లా పరిషత్ సీఈవోగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి లోకేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ నియామకాలను చేపడుతున్నట్టు ఆ ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. కాగా, నాగలక్ష్మి ఏడాదిన్నర కాలంగా ఖమ్మంలో జడ్పీ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీపీ చంద్రశేఖరరెడ్డి



పాసింగ్ అవుట్ పరేడ్‌లో కానిస్టేబుళ్లు





తమ పిల్లలను ముద్దాడుతూ...

అంకితభావంతో పనిచేయాలి

- శాంతిభద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధి అవసరం
- కొత్త చట్టాలు, సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి
- ఘనంగా ట్రెయినీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్
- శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధుల్లో చూపాలి
- మల్టీజోన్-1 ఐజీపీ ఎస్.చంద్రశేఖరరెడ్డి
- తరలివచ్చిన కుటుంబసభ్యులు...

శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లకు గురువారం ఖమ్మం నగరంలోని పరేడ్‌గ్రౌండ్‌లో పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఏఆర్, సివిల్ పోలీసు కానిస్టేబుళ్ల 9 నెలల బేసిక్ ఇండక్షన్ శిక్షణ పూర్తి చేసుకున్న రాచకొండ, రామగుండం, వికారాబాద్ యూనిట్ల నుంచి 263మంది పాల్గొన్నారు. 6



ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

లగచర్ల ఘటనే నాంది

- కాంగ్రెస్ ప్రభుత్వ పతనం మొదలైంది
- గిరిజన మహిళలపై పాశవికంగా దాడి చేశారు
- ఇచ్చిన హామీలు ముందు అమలు చేయాలి
- బీఆర్ఎస్ నేతలు వద్దిరాజు, పువ్వాడ, తాతా మధు
- లగచర్ల గిరిజనులకు సంఘీభావంగా నగరంలో ర్యాలీ

ఖమ్మం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం లగచర్ల నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. లగచర్లలో గిరిజనులపై దాడులకు నిరసనగా, అక్రమ అరెస్టులు చేశారని ఆరోపిస్తూ వారికి సంఘీభావంగా గురువారం సాయంత్రం ఖమ్మంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌నుంచి జడ్పీసెంటర్ వరకు ప్లకార్డులు, కాగడాలతో ప్రదర్శన నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అధ్యక్షతన జరిగిన సభలో వద్దిరాజు మాట్లాడుతూ లగచర్లలో జరిగిన అమానుషంపై పార్లమెంట్‌లో ప్రస్తావించి కాంగ్రెస్‌ను నిలదీస్తామన్నారు. అమాయకమైన గిరిజన మహిళలపై సీఎం ఆదేశాలతో పోలీసులు అత్యంత పాశవికంగా వ్యవహరించారన్నారు. పోలీసులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ ఇటువంటి పనికిమాలిన ముఖ్యమంత్రిని ఎక్కడా చూడలేదన్నారు. లగచర్లలో గిరిజన మహిళలపై అత్యంత పాశవికంగా దాడులు చేయటం, అమాయక గిరిజనులపై అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన బంధువుల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఫార్మాసిటీ పేరుతో గిరిజనుల భూములను అక్రమంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. బాంబులు పేలుస్తామని ఒక మంత్రి ఊదరగొట్టు మాటలు మాట్లాడుతున్నారని, బాంబులు కాంగ్రెస్‌లోనే పేలుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, డీసీసీబీ,సుడా మాజీ చైర్మన్లు కూరాకుల నాగభూషయ్య, బచ్చు విజయ్‌కుమార్‌తోపాటు పలు మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గులాబీ'లో సందడి



- నేడు బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్‌రావు రాక
- మార్కెట్‌లో రైతులతో ముఖాముఖి
- రైతులకు, పార్టీ నాయకులకు పరామర్శ

ఖమ్మం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మళ్లీ రాజకీయ సందడి మొదలైంది. కొంతకాలంగా స్తబ్ధుగా ఉన్న బీఆర్ఎస్.. కార్యాచరణకు సిద్ధమైంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రనేతలు జిల్లాలో పర్యటనలకు శ్రీకారం చుట్టారు. వివిధ సంఘటనలకు సంబంధించి పార్టీ ముఖ్య కార్యకర్తల అరెస్టుల నేపథ్యంతో పాటు, పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న (మిగతా 6వ పేజీలో)

పత్తి మాయగాళ్ల ఆటకట్టు

- లైసెన్సు లేకుండా గ్రామాల్లో కొనుగోళ్లు
- తూకంలో రిమోట్ ద్వారా మోసాలు
- 12మందిని గుర్తించి బైండోవర్ చేసిన పోలీసులు
- రిమోట్‌లు సప్లయి చేస్తున్న వ్యక్తిపైనా కేసు నమోదు



తల్లాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన దళారులకు చెందిన మినీ వ్యాన్లు

తల్లాడ/ఎర్రుపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా గ్రామాల్లో అక్రమ వ్యాపారం చేయడమే కాకుండా పత్తి కొనుగోళ్ల తూకంలో మోసానికి పాల్పడుతూ రైతులను దోచుకుంటున్న 12మందిపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. గురువారం తెల్లవారుజామున మూడుగంటల నుంచి ఐదుగంటల వరకు తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టి, లైసెన్స్ లేకుండా గ్రామాల్లో పత్తి కొనుగోలు చేసేందుకు వెళ్తున్న మినీ వ్యాన్లు, ట్రాలీ ఆటోలను గుర్తించి వాటిని తల్లాడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తల్లాడ మండలంలోని అన్నారుగూడెం, బాలపేట, నర్సింహరావుపేట గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు మినీ వ్యాన్లు, ట్రాలీ ఆటోలతో సూర్యాపేట, పెనుగంచిప్రోలు, ఎర్రుపాలెం, జూలూరుపాడు, చర్ల తదితర ప్రాంతాలకు వెళ్లి నెలరోజులుగా రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేస్తున్నారు. లైసెన్స్ లేకుండా గ్రామాల్లో తిరుగుతూ అక్రమంగా వ్యాపారం చేయడమేకాకుండా పత్తి తూకం వేసే సమయంలో రిమోట్ ద్వారా ఎక్కువ పత్తిని తక్కువ వచ్చేవిధంగా మోసానికి పాల్పడుతున్నారు. బుధవారం చర్ల మండలం సింగసముద్రం గ్రామంలో పత్తి తూకంలో మోసానికి పాల్పడి అన్నారుగూడెం గ్రామానికి చెందిన నలుగురు, బాలపేటకు చెందిన ఒకరు, నర్సింహరావుపేటకు చెందిన మరొకరు పట్టుబడ్డారు. తూకంలో మోసానికి పాల్పడిన ఆరుగురిని అక్కడి రైతులు పట్టుకున్నారు. ఆరుగురికి దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించే ప్రయత్నం చేయగా ఆరుగురు పరారయ్యారు. ఇటీవల ఎర్రుపాలెం, సూర్యాపేట, జూలూరుపాడు (మిగతా 6వ పేజీలో)

నేడు ఎంపీ రేణుకాచౌదరి రాక

పలువురు కార్యకర్తల కుటుంబాలకు ఓదార్పు



ఖమ్మం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యురాలు, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మీడియా సమావేశంలో పాల్గొంటారు. అనంతరం బల్లేపల్లిలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన కాంగ్రెస్ కార్పొరేటర్ మలీదు జగన్ కుటుంబాన్ని పరామర్శిస్తారు. కారేపల్లి మండలం గంగారంతండాలో నునావత్ మోతీలాల్ కుటుంబాన్ని కూడా పరామర్శించనున్నారు. మధ్యాహ్నం ఖమ్మంరూరల్ మండలం మంగళగూడెంలో కన్నేటి వెంకటేశ్వరరావు కుటుంబాన్ని, కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో షేక్ యాకుబ్ కుటుంబాన్ని పరామర్శించి భరోసా ఇవ్వనున్నారు.

సైబర్‌క్రైమ్ కలకలం

పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు

వైరా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ ఆరోపణలపై ఇద్దరు యువకులను రాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకొని హైదరాబాద్ తరలించారు. వైరా మండలంలోని గొల్లపూడికి చెందిన ఇద్దరు యువకులను గురువారం ఉదయం వైరా పోలీసుల సహకారంతో రాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గొల్లపూడికి చెందిన ఇద్దరు యువకులు సాఫ్ట్‌వేర్ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం ఉద్యోగులుగా పనిచేస్తూ సైబర్‌క్రైమ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలతో పోలీసులు అదుపులోకి (మిగతా 6వ పేజీలో)



ఫార్మసిస్టుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

నిర్లక్ష్యాన్ని సహించేది లేదు...

- తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు
- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ
- జిల్లా ఆస్పత్రిలో సిబ్బందిపై ఆగ్రహం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందుల జాబితా ప్రదర్శించాలని తాను గతంలో చెప్పినా పాటించడం లేదని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆస్పత్రి అధికారులపై మండిపడ్డారు. డ్రగ్ స్టోర్‌కు వచ్చిన మందులు ఎన్ని.. మీరు వినియోగించిన మందులు ఎన్ని.. రికార్డుల్లో ఎలా నమోదు చేశారు.. అక్టోబరు 8న వచ్చిన మందులను ఇప్పటివరకు రికార్డుల్లో నమోదు చేయలేరా.. ఇంత నిర్లక్ష్యం ఎందుకు? ఇది మూడోసారి.. మీ తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు అని తీవ్రంగా మందలించారు.

గురువారం ఆమె జిల్లా జనరల్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత నేరుగా ఆరోగ్యశ్రీ నమోదు కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఆరోగ్య మిత్రలతో మాట్లాడారు. ఆ తర్వాత పక్కనే ఉన్న ఓపీ నమోదు కేంద్రానికి వెళ్లి నమోదు తీరును పరిశీలించారు. ఆ తర్వాత ఫార్మసీ సమీపంలో ఏర్పాటు చేసిన మందుల జాబితా బోర్డును పరిశీలించారు.. ఏంటిది.. నేను చెప్పిందేంటీ.. మీరు చేసిందేంటీ అంటూ ఆర్ఎంవో రాంబాబును ప్రశ్నించారు. ఎక్కడా ఫార్మాసిస్టు... ఫార్మా సూపర్‌వైజర్ ఎక్కడా అంటూ ప్రశ్నించారు. ఈ బోర్డులో ఉన్న అంకెలు.. మీ రికార్డుల్లో చూపించాలంటూ రికార్డులను పరిశీలించారు.

అక్టోబరు 8న సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి వచ్చిన మందులను రికార్డులో నమోదు చేయకపోవడం.. ఓపీ, ఐపీ రోగులకు వినియోగించిన మందులను, మిగిలిన స్టాకును రిజిస్టర్లలో నమోదు చేయకపోవడం పట్ల ఆమె తీవ్రంగా మందలించారు. బోర్డులో అన్ని తప్పులు రాసి ఎవరిని పక్కదోవ పట్టించాలని చూస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఆస్పత్రిలోని డ్రగ్ స్టోర్‌లో బీ 12 మందులు... ఇతర వాయిల్స్ వివరాలను అడిగారు. దీనికి సరైన సమాధానం చెప్పకపోవడంతో మీలాంటి నిర్లక్ష్యపు అధికారులు అక్కర్లేదు... మీ తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు.. ఇది మూడో సారి మీకు ఇస్తున్న అవకాశం అంటూ మందలించారు. ఆ తర్వాత డైట్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ రోగులకు అందిస్తున్న భోజనం నాణ్యత, ప్రతి రోజు అందిస్తున్న మెనూ పట్టికను... ప్రతి నెలా వినియోగిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అనంతరం సదరం విభాగాన్ని సందర్శించి ప్రతి వారం క్యాంపులో నమోదవుతున్న స్లాట్లు, అందిస్తున్న సర్టిఫికెట్లు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ధ్రువీకరణ పత్రాల మంజూరు జాప్యం చేయొద్దని సూచించారు. ఈ తనిఖీల్లో ఆమె డ్రగ్ సూపర్‌వైజర్ పద్మావతికి షోకాజ్ నోటీసును జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు, జనరల్ సర్జన్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపర్‌వైజర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఫుడ్ కమిషన్ సభ్యులు

పౌష్టికాహారం ప్రతి పౌరుడి హక్కు

- ఫుడ్ సెక్యూరిటీ అధికారుల తనిఖీలు ముమ్మరం చేయాలి
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, జ్యోతి

7



వరి కొయ్యలను కాలిస్తే ముప్పే

భూమిలోని అవశేషాలు, ఖనిజ లవణాలు నశిస్తాయంటున్న వ్యవసాయ అధికారులు



కొత్త రైల్వేలైన్‌లో మరో ముందడుగు

- మల్కన్‌గిరి-పాండురంగాపురం మార్గంలో భూసేకరణకు రంగం సిద్ధం
- టెండర్లను ఆహ్వానిస్తూ రైల్వే శాఖ నోటిఫికేషన్
- 173.61 కిలోమీటర్ల దూరానికి రూ.3,592 కోట్లు

భద్రాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒడిసాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా పాండురంగాపురం వరకు 173.6 కి.మీ. బ్రాడ్‌గేజ్ రైల్వేలైను నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇటీవల జారీ చేయడంతో ఇందుకు సంబంధించిన పనుల్లో మరో ముందడుగు పడింది. ఆగస్టు 10న కేంద్ర కేబినేట్ ఆమోదం పొందిన ఈ రైల్వేలైను నిర్మాణ కార్యక్రమాన్ని అధికారికంగా ముందుకు తీసుకెళ్లే క్రమంలో రైల్వేశాఖ దీన్ని స్పెషల్ రైల్వే ప్రాజెక్టుగా ప్రకటిస్తూ ఇటీవల స్పెషల్ నోటిఫికేషన్ విడుదలచేసింది. అలాగే మూడు రాష్ట్రాల్లో రైల్వేలైను నిర్మాణం కోసం భూసేకరణ చేసేందుకు టెండర్లను ఆహ్వానించారు. గురువారం నుంచి డిసెంబరు 4వరకు టెండర్లకు దరఖాస్తులను ఆహ్వానించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం 2008 రైల్వే భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వ ప్రైవేటు భూములను సేకరించనున్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్రంలో 19.7 కి.మీ., ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 85.5 కి.మీ., ఒడిశా రాష్ట్రంలో 68.3 కి.మీ. రైల్వే ట్రాక్ నిర్మించేందుకు భూ సేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ భూ సేకరణ పనులు పూర్తయిన అనంతరం ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

173.6 కి.మీ. మేర రైల్వేలైను

ప్రధానమంత్రి గతిశెట్టి మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని బూర్గంపాడు మండలం పాండురంగాపురం నుంచి ఒడిసా రాష్ట్రంలోని మల్కనగిరి(జునాఘర్)కు రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇప్పటికే ఆమోదం తెలిపింది. దీంతో 173.61 కిలోమీటర్ల దూరానికి రూ 3,592కోట్లతో పనులు చేపట్టనున్నారు. తెలంగాణ, ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల మీదుగా సాగనున్న ఈ రైల్వే లైన్ పనులతో భద్రాద్రికి వచ్చే రామ భక్తులు భారీగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రాష్ట్రేతర రామభక్తులకు ఇది ఎంతో ఊరటనిచ్చే అంశం. ఇదిలా ఉండగా పాండురంగాపురం-మల్కనగిరి కొత్త రైల్వేలైన్ కోసం ఫైనల్ లోకేషన్ సర్వే(ఎఫ్ఎల్ఎస్) 2023 సెప్టెంబరులో పూర్తయింది. ఈ రైల్వేలైను ద్వారా వ్యవసాయం, వ్యాపారం, విద్య, పర్యాటక, ఆరోగ్య సంరక్షణలతోపాటు బహుళ వ్యాపార రంగాలకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చినట్టు అవుతుంది. అంతే కాదు ఒడిశా-తెలంగాణలోని పరిశ్రమలకు ఓడరేవుల (కాకినాడ) దూరాన్ని తగ్గించడానికి ఎంతోగానో ఉపయోగపడనుంది. అలాగే ప్రయాణికుల సరకు రవాణా పెంచడంలో ఇది ఎంతో కీలకం కానుంది.

అంకితభావంతో పనిచేయాలి

- శాంతిభద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధి అవసరం
- శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధుల్లో చూపాలి
- కొత్త చట్టాలు, సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి
- మల్టీజోన్-1 ఐజీపీ ఎస్.చంద్రశేఖరరెడ్డి
- ఘనంగా ట్రెయినీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్
- తరలివచ్చిన కుటుంబసభ్యులు...



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీపీ చంద్రశేఖరరెడ్డి



ఖమ్మం క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శిక్షణ పూర్తిచేసుకున్న కానిస్టేబుళ్లు సమాజం పట్ల విశ్వసనీయత పెంపొందించేలా ప్రజాసేవకు అంకితం కావాలని మల్టీజోన్-1 ఐజీపీ ఎస్.చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. 263మంది ఏఆర్, సివిల్ పోలీసు కానిస్టేబుళ్లు 9 నెలల బేసిక్ ఇండక్షన్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం నగరంలోని పరేడ్‌గ్రౌండ్‌లో పాసింగ్ అవుట్ పరేడ్(దీక్షాంత్ పరేడ్) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజీపీ చంద్రశేఖరరెడ్డితోపాటు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ హాజరయ్యారు. ముందుగా ట్రెయినీ కానిస్టేబుళ్ల నుంచి ఐజీపీ గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణ పొందిన వారిలో రాచకొండ, రామగుండం, వికారాబాద్ యూనిట్ల ట్రెయినీ కానిస్టేబుళ్లు ఉన్నారు. విధి నిర్వహణలో వివక్ష చూపమని, తమ సేవలతో దేశ ప్రతిష్ఠ పెంచుతామని ఐజీపీ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సమాజానికి అత్యున్నత సేవలందించే అవకాశం ఉన్న పోలీసు శాఖలో చేరి శిక్షణ పూర్తి చేసుకున్న వారు తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని కోరారు. ప్రజల రక్షణ మన బాధ్యత అని, వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని, నేరాల నియంత్రణ, కొత్త టెక్నాలజీ వినియోగంలో రాష్ట్ర పోలీసులకు మంచి గుర్తింపు ఉన్న నేపథ్యంలో కొత్త చట్టాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు.

9నెలల శిక్షణలో పోలీసు పరిపాలన, డాక్యుమెంటేషన్, వ్యక్తిత్వ వికాసం, లా అండ్ ఆర్డర్, ఇంటెలిజెన్సు, అంతర్గత భద్రత, క్రిమినల్ చట్టాలు, బీఎన్ఎస్ అండ్ బీఎస్ఏ, క్రిమినల్ లా2, బీఎన్ఎస్ఎస్ అండ్ ఎస్ఎల్ఎల్, నేరం, విచారణ, ఫోరెన్సిక్ సైన్సు, ఫోరెన్సిక్ మెడిసిన్, అవుట్‌డోర్ ఫిజికల్ ట్రైనింగ్, లాఠీ డ్రిల్, టియర్‌గ్యాస్, ట్రాఫిక్ డ్రిల్, ఫస్ట్ ఎయిడ్, ఇండోర్, అవుట్‌డోర్ తదితర అంశాలపై క్రమపద్ధతిలో శిక్షణ విజయవంతంగా పూర్తిచేశారని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21న ప్రారంభమైన బ్యాచ్‌లో రాచకొండకు చెందిన ఏఆర్ కానిస్టేబుళ్లు 92, రామగుండం, వికారాబాద్‌కు చెందిన సివిల్ కానిస్టేబుళ్లు 171 మంది శిక్షణ పూర్తిచేసుకుని విధుల్లో చేరడానికి సిద్ధమయ్యారని తెలిపారు.

కాగా, పాసింగ్ పరేడ్‌ను చూసేందుకు ట్రెయినీ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పరేడ్ ముగిసిన అనంతరం ట్రెయినీ కానిస్టేబుళ్ల డ్రెస్‌లో వున్న తమ వారిని కుటుంబసభ్యులు హత్తుకుని సంతోషం పంచుకున్నారు. తల్లులు తమ కుమారులను ముద్దాడుతూ పొంగిపోయారు. అక్కడ చోటుచేసుకున్న ఉద్విగ్నభరిత దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కాగా, శిక్షణలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు ఐజీపీ చంద్రశేఖరరెడ్డి జ్ఞాపికలను అందించారు. రాచకొండకు చెందిన ఏఆర్ కానిస్టేబుళ్లు పి.రఘు, కె.కిషోర్, రామగుండంకు చెందిన సివిల్ కానిస్టేబుళ్లు జి.ప్రశాంత్, ఎం.నవీన్‌కుమార్, డి.ప్రదీప్, హరీష్‌లు బెస్ట్ ఆల్‌రౌండర్ విభాగంలో జ్ఞాపికలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, కుమారస్వామి, విజయబాయి, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రఘు, రెహమాన్, రవి, శ్రీనివాసులు, సాంబరాజు, నరసయ్య, సుశీల్‌సింగ్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, డాక్టర్ జితేందర్ పాల్గొన్నారు.



అభ్యర్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఐజీపీ చంద్రశేఖరరెడ్డి

అన్నీ తానై అన్నయ్య చదివించాడు...

రాణాప్రతాప్, గోరెడ్డిపేట, పెద్దపల్లి



మానాన్న 13ఏళ్ల క్రితం మరణించడంతో కుటుంబ పరిస్థితులు ఆర్థికంగా ఇబ్బందికరంగా మారాయి. అమ్మ, అన్నయ్య కూలి పనులకు వెళుతూ అన్నీ తానై నన్ను చదివించి ఇంతవరకు తీసుకవచ్చారు. కొన్నేళ్ల తర్వాత అన్నయ్యకు కూడా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. అన్నయ్య స్ఫూర్తితోనే నేను కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా.

సొంతంగా చదువుకుని...

ఎం.నవీన్‌కుమార్, లక్సెట్టిపేట్, రామగుండం యూనిట్



ఇంటివద్దే చదువుకుని కొలువుసాధించా. పోలీసు కావాలనేది నా కల. అందుకోసం పలు పుస్తకాలు చదివా. దృఢంగా ఉండేందుకు శిక్షణ తీసుకున్నా. ఈ శిక్షణలో ఫైరింగ్, అవుట్‌డోర్ విభాగంలో ప్రతిభ చూపి మొదటి బహుమతులు సాధించా.

ప్రజలకు సేవచేయాలని...

పట్నం రఘు, చర్ల పటేల్‌గూడ, రంగారెడ్డి యూనిట్



ప్రజలకు సేవ చేయాలంటే అది పోలీసు ఉద్యోగంలో ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో కష్టపడి చదివి, కొలువు సాధించా. 9నెలల శిక్షణలో కూడా ఆల్ రౌండర్ ఇండోర్ విభాగంలో ప్రతిభచూపి మొదటి బహుమతి సాధించా.

పట్టుదలతో ఉద్యోగం సాధించా

ఎదిరే మహేష్, మైలారం, వికారాబాద్ యూనిట్



పోలీసు ఉద్యోగం సాధించాలనే కల ఇప్పటికి సాకారమైంది. కుటుంబ సభ్యుల సహకారంతో వారి సూచనల మేరకు ఉద్యోగం సాధించా. తండ్రి వ్యవసాయం చేసేవాడు. నాన్న కష్టంతీర్చాలని కష్టపడి ఉద్యోగం సాధించా. మా గ్రామంలో సివిల్ విభాగంలో మొదటి కానిస్టేబుల్ నేనే కావడం ఆనందంగాఉంది.

కుటుంబంలో మొదటి ప్రభుత్వ ఉద్యోగం

సురిగి అశోక్‌గౌడ్, కురిమిద్దా, రాచకొండ యూనిట్



నా తండ్రి వ్యవసాయం చేస్తూ నన్ను చదివించాడు. ప్రభుత్వ పాఠశాలలో చదివి తండ్రి చెప్పిన మాటలు విని ప్రభుత్వ ఉద్యోగం సాధించా. నా కుటుంబంలో ఎవరికి ఇంతవరకు ప్రభుత్వ కొలువురాలేదు. మొదటి ఉద్యోగం నాకు రావడం చాలా ఆనందంగా ఉంది.



ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి

వాలీబాల్ పోటీలకు అర్షియా

ఖమ్మం స్పోర్ట్స్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో త్వరలో జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు నగరానికి చెందిన సయ్యద్‌అర్షియా ఎంపికైంది. నిత్యం సర్దార్ పటేల్ స్టేడియంలో సాధన చేసే అర్షియా ఇటీవల మెదక్ జిల్లా చేగుంటలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించి సత్తా చాటింది. దీంతో జాతీయపోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జాతీయపోటీలకు ఎంపికైన ఆమెను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి, వాలీబాల్ కోచ్ అక్బర్‌అలీ తదితరులు అభినందించారు. జాతీయ పోటీలలో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

గ్రూప్-2లో పాల్గొనే మైనారిటీ విద్యార్థులకు ఉచిత ఆఫ్‌లైన్ మాక్‌టెస్టులు

ఖమ్మం, ఖానాపురంహవేలి నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రూప్ 2లో పాల్గొనే మైనారిటీ విద్యార్థులకు ఉచిత ఆఫ్‌లైన్ మాక్‌టెస్టులు నిర్వహిస్తున్నట్టు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కే.సత్యనారాయణ తెలిపారు. డిసెంబర్ 2,3,9,10 తేదీల్లో ఉదయం, మధ్యాహ్న సమయాల్లో తెలంగాణ మైనారిటీ స్టడీసర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 29లోగా మైనారిటీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

మణిపూర్ జాతి హింసను ఆపాలి

సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్

ఖమ్మం సంక్షేమవిభాగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రూరమైన రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు మణిపూర్ ప్రజల మధ్య విబేధాలను సృష్టించి జాతి హింసను ప్రేరేపిస్తున్నాయని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ కమిటీ కార్యదర్శి వర్గసభ్యుడు పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఖమ్మంలో పత్రికా ప్రకటన విడుదల చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను మాస్‌లైన్ జాతీయ కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ప్రకటించారు. అంతులేని జాతి కలహాలు, విపరీతమైన రక్తపాతం ఏర్పడిందన్నారు. ప్రస్తుత మణిపూర్ పరిస్థితికి ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ సూత్రధారిగా కనిపిస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలోని సహజ వనరులను అదాని లాంటి వారి కోసం అప్పగించేందుకు మణిపూర్‌లో హింసకాండను ప్రభుత్వం ప్రేరేపించిందని విమర్శించారు.



విద్యుత్ సంస్థ బలోపేతానికి సహకరిస్తాం

ఎస్ఈ సురేందర్‌ని కలిసిన టీజీపీఈఏ నూతన కార్యవర్గం

ఖమ్మం సంక్షేమవిభాగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్పీడీసీఎల్ విద్యుత్ సంస్థ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని విద్యుత్‌శాఖ ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికైన టీజీపీఈఏ నూతన కార్యవర్గం గురువారం ఎస్ఈ సురేందర్‌ను కలిసి సన్మానించారు. అసోసియేషన్ వరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, బాధ్యులు హీ రాలాల్, వైవీ ఆనంద్‌కుమార్, జీవన్‌కుమార్, కిరణ్‌కుమార్, కోటేశ్వరరావు, సుబ్బారావు పాల్గొన్నారు.



ఎస్ఈ సురేందర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

పత్తి మాయగాళ్ల ఆటకట్టు

(5వ పేజీ తరువాయి)

మండలాల్లో కూడా పత్తి కొనుగోళ్ల తూకంలో మోసానికి పాల్పడి పట్టుబడ్డారు. పత్తి కొనుగోళ్ల తూకంలో మోసాలకు మూడు గ్రామాలకు చెందిన కొందరు వ్యాపారులు పాల్పడుతున్నారనే సమాచారంతో సీపీ ఆదేశాల మేరకు లైసెన్స్ లేకుండా అక్రమంగా పత్తి వ్యాపారం చేస్తున్న వారిపై పోలీసులు దృష్టిసారించారు. గ్రామాలవారీగా అక్రమంగా పత్తి వ్యాపారం చేసే వారి వివరాలను సేకరించి వారు వినియోగించే మినీ వ్యాన్లు, ట్రాలీ ఆటోలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి 12మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

ఎర్రుపాలెంలోనూ ఇదే దందా...

ఎర్రుపాలెం మండల కేంద్రంలో పత్తిని కాటా వేసే సమయంలో మోసం చేసిన ఆరుగురు వ్యక్తులపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. మధిర సీఐ మధు తెలిపిన మేరకు పూర్వాపరాలు ఇలా వున్నాయి. ఎర్రుపాలెం గ్రామానికి చెందిన మిర్యాల అనిల్‌కుమార్ అనే రైతు వద్దకు మంగళవారం ఐదుగురు వ్యక్తులు వచ్చారు. తాము పత్తి వ్యాపారులమని, క్వింటాకు రూ.6వేలు ఇస్తామని చెప్పారు. దీనికి రైతు అనిల్ అంగీకరించడంతో ఆయన పొలంలోనే పత్తికి కాటా వేయడం ప్రారంభించారు. అయితే క్వింటా పత్తి 60 కేజీలే చూపిస్తుండడంతో రైతుకు అనుమానం కలిగి వారిని నిలదీశాడు. తూకం వేసే కాటా యంత్రానికి రిమోట్‌ని అనుసంధానం చేయడం ద్వారా క్వింటా పత్తి 60కేజీలే చూపించేలా చేస్తున్నామని ఒప్పుకొన్నారు. అనంతరం రైతు అనిల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఈ క్రమంలో పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టి వాహనం సీజ్ చేసి తల్లాడ మండలం బాలపేట గ్రామానికి చెందిన గొడ్ల కుటుంబరావు, గొడ్ల నరసింహారావును అరెస్టు చేసినట్టు తెలిపారు. ఇక కాటాలో మోసం చేసిన వారికి సహకరించిన కొల్లి రాంబాబు, ఎల్లారపు శ్రీను, జవ్వాజి వీరబాబుపైన, తూకం వేసే కాటాకు రిమోట్‌కు సెన్సార్ బిగించిన గూడూరు గ్రామానికి చెందిన బడే వెంకటేశ్వరరావుపైన కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

చుక్కల్లో వెల్లుల్లి .. దిగిరానంటున్న ఉల్లి..

బహిరంగ మార్కెట్‌లో రూ. 500 లకు చేరిన కిలో వెల్లుల్లి

రోజు రోజుకూ పెరుగుతున్న ఉల్లి ధరలు



ఖమ్మం మార్కెట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బహిరంగ మార్కెట్‌లలో వెల్లుల్లి , ఉల్లి ధరలు కొండెక్కి వినియోగదారుల కంట కన్నీరు తెప్పిస్తున్నాయి. మార్కెట్‌లో ప్రదేశాలను బట్టి కిలో వెల్లుల్లి రూ. 500 ల వరకు అమ్ముతుండగా, ఉల్లి గడ్డ మాత్రం కిలో రూ. 60 నుంచి రూ.70 లకు తక్కువగా దొరకడం లేదు. మరోవైపు గత నెల రోజుల నుంచి వానాకాలం సీజన్ కొత్త ఉల్లి గడ్డలు మార్కెట్‌లోకి వస్తున్నప్పటికి ధరలు భారీగా పెరగడం వినియోగదారులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. దసరా పండుగ అనంతరం కిలో ఉల్లిగడ్డలు రూ. 40 నుంచి రూ. 45 లకు వచ్చి కొంత తగ్గుముఖం పట్టాయన్న ఆనంద పడేలోపే మళ్లీ ధరలపు పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ప్రస్తుతం గల్లీ మార్కెట్లలో పావుకిలో వెల్లుల్లి రూ.100 ల నుంచి రూ.130 లు పలుకుతుండగా, కిలో ఉల్లి రూ. 60-70 లకు లభ్యమవుతున్నాయి.

గత నెల క్రితం కిలో రూ. 350- 380 లకు లభించిన ఎల్లిపాయ ప్రస్తుతం కిలోకు రూ. 100 లు నుంచి రూ. 150లు పెరిగి రూ. 500 లకు చేరింది. ఉల్లి, ఎల్లుల్లి ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుండటంతో రవాణా చార్జీల భారంతో రేట్లు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా దేశంలో ఎల్లుల్లిని ఎక్కువగా పండించే మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలలో మూడేళ్ల క్రితం వెల్లుల్లి రైతులకు కిలో రూ. 20 లు నుంచి రూ.30 లే దక్కి, భారీగా నష్టపోయారు. దీంతో అక్కడి రైతులు గత రెండేళ్ళ నుంచి ఎల్లుల్లి పంటను తక్కువ మొత్తంలో సాగు చేస్తున్నారు. మరి కొంత మంది రైతులు ఎల్లిల్లి పంటకు క్రాఫ్ హాలీడే ప్రకటించిన నేపథ్యంలో డిమాండ్‌కు తగ్గ సరఫరా తగ్గిందని దీంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపార నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఉల్లిగడ్డ ఎక్కువగా పండించే మహారాష్ట్ర రైతులు ఉల్లిని ఈ ఏడాది భారీగానే సాగు చేశారు. కాగా తీరా పంట చేతికందే సమయంలో అక్కడ నిత్యం వర్షాలు పడుతుండటంతో ఉల్లి నీరు పీల్చుకొని డ్యామేజ్ అయింది. దీంతో సరిపడా సరఫరా లేక ఉత్పత్తి లోటుతో ధరలు రోజు రోజుకూ పెరుగుతూ వినియోగదారులకు చుక్కలు చూపిస్తునాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో వెల్లుల్లి, ఉల్లి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈనేపథ్యంలో ఉల్లిగడ్డ ధరలు త్వరలోనే తగ్గుతాయని, వెల్లుల్లి ధరలు మాత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో కొత్త సీజన్ పంట అందుబాటులోకి వస్తేనే తగ్గుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

లగచర్ల ఘటనే నాంది

(5వ పేజీ తరువాయి)

వారి కుటుంబాలను పరామర్శించడం ద్వారా కేడర్‌కు భరోసా ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మాజీమంత్రి, బీఆర్ఎస్ కీలకనేత తన్నీరు హరీ‌ష్‌రావు జిల్లాలో శుక్రవారం పర్యటించనున్నారు.

గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ దారుణంగా దెబ్బతిన్న విషయం విదితమే. అయినప్పటికీ ఉమ్మడి జిల్లాలో నాయకులు, కార్యకర్తలు కొందరుపార్టీని వదలకుండా పట్టుదలతో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేడర్‌ను రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వైపు సమాయత్తం చేసేందుకు హరీ‌ష్‌రావు జిల్లా పర్యటన ఖరారు చేశారు. శుక్రవారం ఉదయం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి పత్తి, మిర్చి రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడతారు. పత్తి, మిర్చి, ధాన్యం కొనుగోళ్ల తదితర సమస్యలను ప్రస్తావించనున్నారు.

మధ్యాహ్నం 12గంటలకు చింతకాని మండలం పొద్దుటూరులో ఆత్మహత్య చేసుకున్న రైతు బోజడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శిస్తారు. అలాగే బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను కూడా పరామర్శించనున్నారు. ఇటీవల ఆయనను పోలీసులు అరెస్టు చేయగా, బెయిల్‌పై విడుదలైన విషయం విదితమే. అలాగే చింతకాని మండలం లచ్చగూడెంలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన రైతు గూని ప్రసాద్ కుటుంబసభ్యులను పరామర్శించనున్నారు. వారి కుటుంబానికి బీఆర్ఎస్ పక్షాన భరోసా కల్పించనున్నారు.

సైబర్ క్రైమ్ కలకలం

(5వ పేజీ తరువాయి)

తీసుకున్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాలకు ఆన్‌లైన్‌లో చాట్ జీపీటీ లూల్ డేటా విక్రయించారనే ఆరోపణలపై దాదాపు మూడు, నాలుగు నెలల కిందట మహారాష్ట్రకు చెందిన పోలీసులు గొల్లపూడి వచ్చి విచారించినట్లు సమాచారం. ఆ సమయంలో ఒక యువకుడు ఆచూకీ లభించలేదని తెలిసింది. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఉన్న ఒక యువకుడిని మహారాష్ట్ర పోలీసులు అదుపులోకి తీసుకొని ఆ సమయంలో విచారించి వదిలేశారు. ఆ తర్వాత ఆచూకీ లభించకుండా పోయిన మరో యువకుడిని వైరా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి వీడియో కాల్ ద్వారా మహారాష్ట్ర పోలీసులతో విచారణ నిర్వహించారు. ఇప్పుడు మళ్లీ రాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు వైరా వచ్చి స్థానిక పోలీసుల సహకారంతో మహారాష్ట్ర పోలీసులు విచారించి, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ యువకుల ఖాతాల్లో భారీగా నగదు నిల్వలున్నట్లు మహారాష్ట్ర పోలీసుల విచారణలో బయటపడింది. ఈ ఇద్దరు యువకులకంటే ముందు గొల్లపూడిలో మరో యువకుడు సైబర్ క్రైమ్‌కు పాల్పడి ఆ తర్వాత దానినుంచి బయటపడినట్టు ప్రచారం జరుగుతోంది.

తాళ్లచెరువుకు బస్సులు లేక ఇక్కట్లు

తిరుమలాయపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లచెరువు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యంలేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఖమ్మంనుంచి తాళ్లచెరువు వరకు గతంలో ఆర్టీసీ బస్సు ఉండేది. ఇటీవల కాలంలో ఆర్టీసీ బస్సు నిలిపివేశారు. దీంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో తాళ్లచెరువు, తిమ్మక్కపేట, ఎర్రగడ్డ, గోపాలపురం, కొక్కిరేణి గ్రామాల ప్రజలు విద్యార్థులు నిత్యం ఖమ్మం వస్తుంటారు. ఈనేపథ్యంలో ఒక్కసారిగా ఆర్టీసీ బస్సు నిలిపివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలను ఆశ్రయిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాళ్లచెరువుకు బస్సు సౌకరయం కలపించాలని గ్రామ మాజీ సర్పంచ్ సంద్ర వెంకన్న జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈవిషయంపై రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళుతున్నట్టు తెలిపారు.

సాగర్‌జలాల సక్రమ సరఫరాకు సహకరించాలి

కాలువపై పర్యవేక్షించిన ఎన్నెస్పీ ఎస్ఈ

ఖమ్మం కలెక్టరేట్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాల సక్రమ సరఫరాకు సహకరించాలని.. క్షేత్రస్థాయిలో ఎన్నెస్పీ సిబ్బంది నిత్యం పర్యవేక్షించాలని ఎన్నెస్పీ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం ఆయన 21 ఎంబీసీ ప్రధాన కాలువపై తనికెళ్ల నుంచి ఏన్కూరు వరకు పర్యవేక్షించారు. ఆయన ఆయా సెక్షన్ల అధికారులతో మాట్లాడారు. ఎక్కడా నీళ్ల వృథా కావద్దని ప్రతి నీటిచుక్కా వినియోగం అయ్యేలా చివరి ఆయకట్టుకు చేరుకునేలా క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. ఎక్కడైనా సిబ్బంది అలక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలువలపై ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈఈ అనన్య, డీఈ సీహెచ్ గోపాల్‌రావు తదితరులున్నారు.



ఎన్నెస్పీ కాలువపై అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు

ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం..

రూ.56కోట్ల విలువైన 25 వేల మె.ట కొనుగోళ్లు



ఖమ్మం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రభుత్వ కొనుగోలుకేంద్రాల వద్ద ముమ్మరమవుతున్నాయి. మొన్నటి వరకు స్తబ్దుగా ఉన్న ధాన్యం కొనుగోళ్లు రోజురోజుకు పెరుగుతుంది. జిల్లాలో 330 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 130 కేంద్రాల్లో రూ.56కోట్ల విలువైన సుమారు 25వేల. మెట్రిక్ టన్ను. ధాన్యం కొనుగోళ్లు చేశారు. ఇంకా 18వేల మె.ట.ధాన్యం కొనుగోలు కేంద్రాలవద్ద కల్లాల్లో సిద్ధంగా ఉంది. జిల్లాలో 4.20 లక్షల మె.ట ధాన్యం ఉత్పత్తి అవుతుందని, రెండు నుంచి మూడులక్షల మె.ట ధాన్యం రైతుల కొనుగోలు కేంద్రాల్లో అమ్మే అవకాశం ఉందని భావించి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు గతం కంటే రెట్టింపు చేశారు. సన్నధాన్యానికి క్వింటాకు రూ.500బోనస్ కూడా ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. ప్రభుత్వ క్వింటాకు ధాన్యం రూ.2320లు ప్రకటించింది. అది తేమ నిబంధనలవల్ల మొన్నటి వరకు కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోళ్లలో జాప్యం చేశారు. రైతులు ఆరుదల లేకుండానే తేమ ఉన్న ధాన్యం తేవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది ధాన్యం పొలంలో ఆరిన తర్వాత కోతలు కోయాలని ఆరబెట్టిన ధాన్యం తేవాలని పదేపదే చెబుతున్నా ఇంకా కొందరు తేమ ఉన్న ధాన్యం తెస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రైవేటు వ్యాపారుల ఈసారి పోటాపోటీగా కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రూ.2100 చెల్లించి తేమ ధాన్యాన్ని ఇంటివద్ద కొనుగోలుచేస్తున్నారు. మిల్లర్లు, ధాన్యం వ్యాపారులు సన్న ధాన్యం కొనుగోళ్లకు పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈసారి రైతుల ధాన్యం ఇటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, అటు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలో 53సీఎంఆర్ కింద తరలించేందుకు అనుమతి ఇచ్చారు. అయితే కొన్నిచోట్ల గోనె సంచుల సమస్య తలెత్తుతుంది. ప్రభుత్వం నుంచి పాత గోనేసంచులు కూడా తప్పని సరిగా వినియోగించాలని కొంత కోత విధించడంతో జిల్లాకు కొత్త గోనేసంచులతోపాటు పాత సంచులు కూడా కొనుగోలు కేంద్రాలకు వెళుతున్నాయి. అవి చినిగిపోయి ఉన్నాయి. ధాన్యం కారిపోతుందంటూ రైతులు తీసుకోవడానికి ఇష్టపడడంలేదు. జిల్లాలో కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలవద్ద కొనుగోలుచేసినా వివరాలు ఆన్‌లైన్ నమోదుచేయడంలో జాప్యం చేయడంతో డబ్బులు రైతులకు ఖాతాల్లో పడకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్ చేసిన 48గంటల్లో రైతులకు ధాన్యం కొనుగోలు డబ్బులు వచ్చే అవకాశం ఉంది. సిబ్బంది కొరత తదితర సమస్యలతో ఆన్‌లైన్ ప్రక్రియ కొంత జాప్యం నడుస్తుంది. జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన రూ.56కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా రూ.18కోట్లు సొమ్ములు రైతుల ఖాతాల్లో జమచేశారు.

క్రైం సమాచారం

వివాహిత ఆత్మహత్య

నేలకొండపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆచార్లగూడెం గ్రామానికి చెందిన గోళ్ల వైష్ణవి(22) గురువారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆచార్లగూడేనికి చెందిన వైష్ణవికి సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం అనంతగిరికి చెందిన గోళ్ల కొండలుతో దాదాపు 5సంవత్సరాల క్రితం వివాహమైంది. వైష్ణవి గత 2నెలలుగా ఆచార్లగూడెంలోని పుట్టింట్లోనే ఉంటున్నది. ఏ కారణమో తెలియదు కానీ గురువారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఎర్రుపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగళ్లపాడు రైల్వేబ్రిడ్జి సమీపంలో ఓ చెట్టుకు వ్యక్తి ఉరేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. ఎర్రుపాలెం ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని విశాఖపట్నం జిల్లా పెద ముషిడివా డ గ్రామానికి చెందిన పిల్లాకిషోర్ (27) అనే వ్యక్తి ఉరేసుకున్నాడు స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని మధి ర ఆర్కే ఫౌండేషన్ సహకారంతో మధిర ప్రభు త్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. మృతి కి గల కారణాలు తెలియాల్సి ఉందని ఘటన స్థలంలో ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపా రు.

వైరా ఎమ్మెల్యేకు సోదరుడి వియోగం


సోదరుడి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

వైరా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ రెండో సోదరుడు మాలోతు వాల్యానాయక్ (72) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. కొంతకాలంగా వాల్యానాయక్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మండలం కారుకొండ రామవరంలో మృతిచెందారు. వాల్యానాయక్‌కు భార్య, ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలున్నారు. వైరా మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, వైరా నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కట్ల రంగారావు, సంతోష్, నాగరాజు, శీలం వెంకటనర్సిరెడ్డి, మట్టూరి వెంకటేశ్వరరావు, బోళ్ల గంగారావు, ఏదునూరి సీతారాములు, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, పొదిల హరినాథ్, పమ్మి అశోక్, కోసూరి శ్రీనివాసరావు, రాయల పుల్లయ్య, ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, కాపూరి శ్రీను తదితరులు వాల్యానాయక్ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

ఆటో పల్టీ: ఆరుగురికి గాయాలు

వైరా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరాకు సమీపంలోని సాయిబాబా మందిరం వద్ద జాతీయ ప్రధాన రహదారిపై ఒక ఆటో అదుపుతప్పి పల్టీకొట్టిన ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం ఆరుగంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. తల్లాడ మండలం కేశ్వాపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబసభ్యులు ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలంలోని గౌరారంలో తమ బంధువుల దశదినకర్మకు వెళ్లి తిరిగి స్వగ్రామం కేశ్వాపురానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆటో ముందు ఓ ద్విచక్రవాహన చోదకుడు అడ్డదిడ్డంగా వెళ్లడంతో అతడిని కాపాడే ప్రయత్నంలో ఆటో డ్రైవర్ బ్రేక్ వేయగా ఆటో పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో చింతపట్ల సరిత, తాళ్లూరి సత్యంబాబులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిద్దరి కాళ్లు విరిగిపోయాయి. నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. 108 వాహనంలో ఖమ్మం తరలించారు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం

జూలూరుపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లరేవు గ్రామంలో 11కేవీ విద్యుత్ వైరు తగలడంతో ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధమైన సంఘటన గురువారం చోటుచేసుకుం ది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన ఓ వ్యాపారి వరిగడ్డిని విక్రయించేందుకు ట్రాక్టర్‌లో జూలూరుపాడుకు తీసుకొచ్చారు. మండలం లోని గుండ్లరేవు గ్రామానికి చెందిన భూక్య మోహన్ రైతు వరిగడ్డిని కొనుగోలు చేశాడు. దీంతో గడ్డిని సదరు రైతు ఇంట్లో దిగుమతి చేసేందుకు గుండ్లరేవు గ్రామానికి వ్యాపారి వెళ్లాడు.

ఈ క్రమంలో గ్రామంలో రహదారి పక్కన ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు వరిగడ్డికి తగలడంతో మంటలు వ్యాపించాయి. డ్రైవర్ అప్రమత్తమై ట్రక్కు లేపి గడ్డిని కిందపడేశాడు. వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది. కాలిపోయిన వరిగడ్డి విలువ రూ.12వేలు ఉంటుందని రైతు తెలిపారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

డిప్లమో కోర్సులకు 25న కౌన్సెలింగ్

వైద్య కళాశాల ప్రిన్సిపాల్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండేళ్ల డిప్లొమా ఇన్ అనస్త్రీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్స్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 25న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని గురువారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రజ్ఞా సమావేశ మందిరంలో మొదటి విడత కౌన్సెలింగ్ నవంబరు 25న నిర్వహించనున్నటు వివరించారు. మొదటి విడత కౌన్సిలింగ్‌లో మిగిలిన ఖాళీలకు ఆ తర్వాత రెండో విడత నవంబరు 30న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కౌన్సిలింగ్ లో బైపీసీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత, ఎంపీసీ విద్యార్థులకు తర్వాతి ప్రాధాన్యతతో సీట్ల కేటాయించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వరి కొయ్యలు కాలిస్తే ముప్పే..

వరి కొయ్యలను కాల్చడంతో భూసారం దెబ్బతింటుంది

పొలంలో కలియ దున్నితే అనేక ప్రయోజనాలు

మొక్కలకు కావాల్సిన నత్రజని, పాస్పరస్ లభిస్తాయంటున్న వ్యవసాయాధికారులు



ఖమ్మం వ్యవసాయం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ప్రస్తుతం కూలీల కొరత ఉండటంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. వరి కోతలకు హార్వెస్టర్లను వినియోగిస్తుండటంతో గడ్డి వినియోగం తగ్గిపోయింది. పశుసంపద ఉన్న వారు గడ్డిని సేకరిస్తుండగా మిగతావారు అలాగే పొలంలోనే వదిలేస్తున్నారు. తదుపరి పంటకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరి కొయ్యలతో పాటు, గడ్డిని దహనం చేస్తున్నారు. అన్నదాతలు అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యతో భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాలు

- వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.
- విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, పాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం, దిగుబడితగ్గిపోతుంది.
- భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి.
- పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి.
- మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి.
- పొలాల్లో తిరిగే పాములు, ముంగిసలు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక రకాల జీవరాశులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది.
- గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కూడా ఒక్కోసారి బుగ్గిపాలవుతున్నాయి.
- ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాలు దగ్గరే ఉంటే ధాన్యం కాలిపోయే ప్రమాదం ఉంది.

కలియ దున్నితే ఎన్నో ప్రయోజనాలు

- వరి కొయ్యలు నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుంచి 10 శాతం పెరిగే అవకాశం ఉంది.
- దుక్కి దున్నే సమయంలో సూపర్ పాస్పెట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో ముగిరి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగంవరకు తగ్గుతుంది.
- మొక్కలకు 2 శాతం నత్రజని, 4 శాతం పాస్పరస్ అదనంగా అందిస్తుంది.
- జింక్, మాంగనీసు, ఇనుము, కాల్షియం లాంటి సూక్ష్మధాతువులు అంది పంటకు మేలు చేకూర్చుతాయి.
- నేలలో కరుగని మూలకాలను అనుకూలంగా మార్చుతుంది. నీటి నిల్వ పెరుగుతుంది.
- టన్ను గడ్డి కావాలంటే వరి పెరుగుదలకు 18.9 కిలోల పొటాషియం, 6.2 కిలోల నత్రజని, 1.1కిలోల భాస్వరంతో పాటు కొంత మోతాదులో సూక్ష్మ పోషకాలు అవసరం అవుతాయి. కొయ్యకాళ్లనుదున్నితే పోషకాలు తిరిగి నేలకు చేరుతాయి.
- పొలందున్నే పది రోజుల ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు అందించాలి. తర్వాత ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్పెట్ చల్లాలి. దీంతో భూమి దెబ్బతినడం నుంచి తప్పించడమే కాకుండా భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచవచ్చు.

కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్ రికవరీపై హైకోర్టు ఆదేశాలు

రికవరి 180 నెలల నుంచి 135 నెలలకు తగ్గిపు

వైరా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల నుంచి ఇకమీదట 135 నెలలు మాత్రమే కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్‌ను రికవరీ చేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేసే సందర్భంలో తాము తీసుకోబోయే పెన్షన్‌లో 40శాతం పెన్షన్ అడ్వాన్స్‌గా పెన్షన్ కమ్యూటేషన్ పేరుమీద పొందుతారు. అలా తీసుకున్న పెన్షన్ సొమ్మును వందనెలలపాటు రాష్ట్ర ప్రభుత్వం రికవరీ చేస్తే సరిపోతుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం 15సంవత్సరాల కాలానికి అంటే 180నెలలు ఈ పెన్షన్ సొమ్మును రికవరీ చేస్తుంది. ఈ విధానాన్ని రద్దుచేయాలని ప్రభుత్వ పెన్షనర్లు 15సంవత్సరాల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు విన్నవించి ధర్నాలు, నిరసనలు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా 180నెలలపాటు పెన్షన్ రికవరీ చేస్తుంది. దాంతో విసిగివేశారిన రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దాంతో ఈనెల 20న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు అనుకూలంగా కోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేర కు ఇకమీదట 135నెలలు మాత్రమే కమ్యూటేషన్ ఆఫ్ పెన్షన్‌ను విశ్రాంత ఉద్యోగుల నుంచి ప్రభుత్వం రికవరీ చేయనుంది. కోర్టు ఉత్తర్వుల పట్ల విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

హైకోర్టు ఆదేశాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభు త్వ విశ్రాంత ఉద్యోగులు ఎవరూ కూడా ఇకమీదట కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేదని శరత్‌బాబు తెలిపారు.

పాపికొండల బోటు యజమానులకు నోటీసులు జారీ

బోటుకు రూ.2,500 నుంచి రూ.4 వేలు చెల్లించాలని ఏపీ అటవీశాఖ ఉత్తర్వులు: 25లోపు గడువు



భద్రాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పర్యాటకంగా విశేష ప్రాచుర్యం పొం దిన పాపికొండలు-పేరంటాలపల్లి బోటు నిర్వాహకులకు అటవీశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. జాతీయ పాపికొండల అభయారణ్యంలో పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రకృతి సమతుల్యతను పాటించాలని అటవీశాఖ రాజమండ్రి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు బీఎన్ఎన్‌మూర్తి నోటీసులు జారీ చేయగా వాటిని బోటు యజమానులకు ఇన్‌చార్జ్ ఫారెస్టు రేంజి ఆఫీసర్ పి.సత్యనారాయణమూర్తి అందజేశారు. ప్రతినిత్యం వేలాది మంది పర్యాటకులు రెండు తెలుగు రా ష్ట్రాల నుంచే కాక దేశం నలుమూలల నుంచి ఈ పర్యాటక ప్రాం తంను తిలకించేందుకు బోట్లపై విహారం చేస్తారు. ఈ క్రమంలో పాపికొండల అభయారణ్యంలో పర్యటించే సమయంలో వదిలేసిన ప్లాస్టిక్, వ్యర్థాలతో పాటు, ధ్వని కలుషిత వలన ప్రకృతి సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని అటవీశాఖ అధికారులు ఆందోళన వ్య క్తం చేశారు. దీంతో రెండు దశాబ్దాల ముందున్న చార్జీలను పెంచుతూ 50 లోపు పర్యాటకులుండే బోటుకు రూ.2,500లని, 50 పైన 100 లోపు ఉన్న పర్యాటకుల బోటుకు రూ.4 వేలు చార్జి చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సంబంధిత 21 మంది బోటు యజమానులకు నోటీసులను జారీ చేశా రు. గతంలో 2002 నుంచి ప్రతి బోటులో ప్రయాణించే ఒక పర్యాటకుడి నుంచి రూ.2 తీసుకుంటుండగా బోటుకు రూ.100 వసూలు చేసేవారు. వీటిని ఈ నెల 25 లోపు చెల్లించాలని బోటు నిర్వాహకులకు స్పష్టం చేశారు. పర్యావరణం పరిరక్షణ, ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా తాము చర్యలు చేపట్టేందుకు ఈ చార్జీలను పెంచడం జరిగిందని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

కాగా బోటు నిర్వాహకులు ఈ విషయమై చింతూరు ఐటీడీఏ పీవోను గురువారం కలిసినట్లు తెలుస్తోంది.

రామయ్యకు ఘనంగా పట్టాభిషేకం

భద్రాచలం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి గురువారం పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజునస్వామి వారికి పట్టాభిషేకం నిర్వహించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా తొలుత స్వామి వారికినిత్య కల్యాణం నిర్వహించి అనంతరం పట్టాభిషేక కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పట్టాభిషేక ఘట్టం ప్రవచనంను దేవస్థానం రామాయణ పారాయణదారు లు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు చేశారు. తరువాత కిరీటదారణ, ప్రోక్షణ, ప్రత్యేక ప్రసాద నివేదన చేసి భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. అంతకు ముందు స్వామి వారికి నిత్యకల్యాణం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అర్చకులు అమరవాది మధుసూదనాచార్యులు పాల్గొన్నారు.

జైళ్ల శాఖ ఆధ్వర్యంలో రెండోరోజు రిట్రీట్

ఖమ్మంక్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జైళ్లశాఖ ఆధ్వర్యంలో రెండోరోజు గురువారం రిట్రీట్ కార్యక్రమంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయసేవా అధికారి కేవీ చంద్రశేఖరరావు హాజరయ్యారు. ఆయనకి జిల్లా జైలు పర్యవేక్షణాధికారి శ్రీధర్ స్వాగతం పలికారు. అనంతరం న్యాయాధికారి మాట్లాడుతూ జైల్లో ఖైదీల కోసం న్యాయవ్యవస్థ చేపట్టిన సహాయ కార్యక్రమాలు ఏవిధంగా న్యా యం సహాయం పొందవచ్చు, కేసుల విషయంలో ఉచిత న్యాయసహాయం ఎలా అందిస్తున్నారనే విషయంలో సిబ్బందికి తెలిపారు. అదే విధంగా ఇలాంటి రిట్రీట్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా సిబ్బందిలో కొత్త ఉత్సాహం నింపుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ గణేష్, వరంగల్ జిల్లా సబ్‌జైల్ అధికారి విజయ్‌డైనీ, ఖమ్మంజిల్లా జైల్ అధికారి జి.వెంకటేశ్వర్లు, జిల్లా జైలు పర్యవేక్షణాధికారి ఏ.శ్రీధర్, జైలర్లు సక్రునాయక్ , లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయని కాంగ్రెస్ : బీజేపీ

సత్తుపల్లి/మధిర నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాలలో విఫలమైందని, ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాపారావు అన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరు రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ఛార్జిషీట్ వేయనున్నామని చెప్పారు. మూసీనది ప్రక్షాళన పేరుతో భూములను కబ్జా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల కుట్ర దాగిందని గ్రహించిన బీజేపీ మూసినది కాపాడేందకు కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సమగ్ర సర్వే కేవలం రానున్న స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులు, వర్గాల ఓట్లు సంపాదించడానికే తప్పా వేరొకటి కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈవీ.రమేష్, నాయుడు రాఘవరావు, వీరంరాజు, మధుసూ దన్‌రావు, బాలకృష్ణారెడ్డి, కృష్ణయ్య, మధుసూదన్‌రావు, భాస్కరరావు పాల్గొన్నారు.

కన్నీళ్ల కట్టెల పొయ్యిలు..

మధ్యాహ్న కార్మికులకు అందని బిల్లులు ● మహిళల ఇబ్బదులు


కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న మహిళ

రఘునాథపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంఖ్యను అనుసరించి మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ భృతి నుంచి గత ప్రభుత్వంలో నెలకు రూ.3వేలు వేతనాలను ఇస్తామని టీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రకటించటంతో క్షీరాభిషేకాలు చేశారు. కానీ ప్రభుత్వ అధికారిక నిర్ణ యం అమలు కాలే దు. పెంచుతామన్న వేతనాలు పెరగలేదు. ఒక్క రఘునాథపాలెం మండలంలోనే రూ.13లక్షల బకాయిలు మధ్యాహ్న భోజన కార్మికులకు అందాల్సి ఉంది. అయినా మధ్యాహ్న భోజన కార్మికులు వంటను కొనసాగిస్తున్నారు. వడ్డీ లకు డబ్బులు తీసుకొచ్చి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే మధ్యాహ్న భోజనానికి గ్యాస్ సిలెండర్‌లను వాడలేక కట్టెల పొయ్యిలపై వంటలను చేస్తున్నారు. దీంతో పదుల సంఖ్యలో మహిళలు శ్వాసకోశ వ్యాధులకు గురైతున్నారు. ప్రభుత్వం అధికారికంగా గ్యాస్ సిలిండర్లను సప్లయ్ చేస్తే మినహా పరిష్కారం లేదని వాపోతున్నారు. ఈ విషయంపై ఎంఈవో రాములును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన బిల్లులు ఖజానాలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వంట చేసేందుకు ప్రభుత్వం నుంచి అధికారికంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయటం లేదని తెలిపారు.

పౌష్టికాహారం ప్రతీ పౌరుడి హక్కు

ఫుడ్ సెక్యూరిటీ అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలి

ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, జ్యోతి

అధికారులతో సమీక్ష



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ సభ్యులు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు పౌష్టికాహారం స్వీకరించడం రాజ్యాంగం కల్పించిన హక్కు.. ఆహార భద్రత చట్టాన్ని పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.. అని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, భూక్యా జ్యోతి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆహారభద్రత చట్టం అమలుపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఖమ్మం జిల్లాలో ఆహారభద్రత చట్టం అమలుకు తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు చేపట్టిన చర్యలు, ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న న్యూట్రీ గార్డెన్ వివరాలను అధికారులు, కమిషన్ సభ్యులకు వివరించారు. కమిషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల శారీరక అభివృద్ధికి అవసరమైన పోషకాలను పరిగణలోకి తీసుకుని నిపుణులు మధ్యాహ్న భోజనం మెనూ తయారు చేశారని మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందడం లేదని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలిందన్నారు. పాఠశాలలో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడం మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల హెచ్ఎంలపై ఉందన్నారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాగుందని ప్రశంసించారు. కొణిజర్ల మండలం సీతాపురం గ్రామంలోని అంగన్‌వాడీలో గర్భిణులకు పాలు ఇంటికి ఇస్తున్నారని సమాచారం వచ్చిందని వీటిని పరిశీలించాలని, ఇం టికి పాలు ఇవ్వవద్దని అన్నారు. హాస్టల్స్, ప్రభు త్వ పాఠశాలల్లో, ప్రైవేటు హోటల్స్‌లను ఫుడ్ సె క్యూరిటీ అధికారులు నిరంతరం తనిఖీ చేయాలన్నారు.

విద్య. పౌర సరఫరాలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఫుడ్ సెక్యూరిటీ, ఎస్సీ అభివృద్ధి, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో నిర్వహించే కార్యక్రమాలను కమిషన్ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి చందన్‌కుమార్, టీజీసీఎస్సీ జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కె. సత్యనారాయణ, డీఈవో సోమశేఖరశర్మ, జిల్లా సంక్షేమ అధికారి కే.రాంగోపాల్ రెడ్డి, డీఎంహెచ్‌వో బి. కళావతిబాయి, బీసీ అభివృద్ధి అధికారి జి. జ్యోతి, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు ఎస్. విజయలక్ష్మి, మండలవిద్యా శాఖాధికారులు, రేషన్ డీలర్ అసోసియేషన్ సభ్యులు బానోతు వెంకన్న, జానియమియా పాల్గొన్నారు.

అంతకు ముందు ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి మాతా శిశుసంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను పరిశీలించారు. లేబర్‌రూం, ఓపీ నమోదు, పౌష్టికాహారంపై వారిని అడిగితెలుసుకున్నారు. ఆ తర్వాత తల్లిపాల కేంద్రాన్ని సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. వారి వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, ఆర్ఎంవో డాక్టర్ బి రాంబాబు, చిన్నపిల్లల వైద్యు లు డాక్టర్ బాబూరత్నాకర్, డాక్టర్ పవన్‌కుమార్, నర్సింగ్ సూపరిన్‌టెండెంట్ ఇందిర తదితరులున్నారు.

భక్తరామదాసు కీర్తనలకు జీవం పోసిన మహాగాయకుడు

నేడు బాలమురళీకృష్ణ 8వ వర్ధంతి

భద్రాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ వాగ్గేయకారుడు భక్తరామదాసు కీర్తనలకు మంగళంపల్లి బాలమురళీకృష్ణ జీవం పోశారు. భక్తరామదాసు రచించి గానం చేసిన ఎన్నో అజరామరమైన కీర్తనలను జనబాహుళ్యంలోకి తీసుకొచ్చిన మహనీయుడు బాలమురళీకృష్ణ అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. అదిగో భద్రాద్రి .. గౌతమి ఇదిగో చూడండి, పలుకే బంగారమాయనే ఇలా ఎన్నో కీర్తనలకు ఆయన తనగానంతో జీవం పోశారు. శుక్రవారం(నవంబరు 22) ఆయన 8వ వర్ధంతి సందర్భంగా ఆ మహాగాయకుడి స్మృతులను భద్రాద్రి వాసులు స్మరించకుంటున్నారు.

రెండుసార్లు భద్రాద్రికి వచ్చిన బాలమురళీకృష్ణ.. రామదాసు కీర్తనలను ఆలపించి సంగీత ప్రియులను, రామభక్తులను ఓలలాడించారు. ఆయన తొలిసారిగా 1972లో భద్రాచలంలో ముక్కోటిని పురస్కరించుకొని నిర్వహించిన వాగ్గేయకారోత్సవాలకు హాజరయ్యారు. అప్పటి భద్రాద్రి దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ అల్లూరి మూర్తిరాజు, ఈవో నాగిరెడ్డి భద్రాచలానికి ఆహ్వానించడం జరిగింది.

2011 ఫిబ్రవరి 10న మరోసారి భద్రాచలానికి బాలమురళీకృష్ణ వచ్చారు. ఇందులో ఎంతో ప్రత్యేకత ఉంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన విద్వాంసుడిగా ఉన్న ఆయనను భద్రాద్రి దేవస్థా నం ఆస్థాన విద్వాంసుడిగా కూడా ఉండాలని అప్పటి భద్రాద్రి దేవస్థానం ఈవో ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ కోరారు. దీంతో ఆయన అంగీకరించడంతో 2011 ఫిబ్రవరి 10న భద్రాచలంలోని చిత్రకూట మండపంలో అప్పటి దేవస్థానం ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు.


రామదాసు కీర్తనలను ఆలపిస్తున్న మంగళంపల్లి(ఫైల్)

సీపీని కలిసిన రూరల్ ఎస్ఐ విశ్వతేజ



ఖమ్మంరూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ ఎస్ఐగా బుధవారం బాధ్యతలు చేపట్టిన విశ్వతేజ గురువారం సీపీ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల జరిగిన సబ్‌ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో మహబూబాబాద్ జిల్లా గూడురులో పనిచేస్తున్న ఆయనను ఖమ్మం రూరల్ ఎస్సైగా బదిలీ చేశారు. సీపీని కలిసిన అనంతరం అడిషనల్ డీసీపీ లాండ్ ఆర్డర్ ప్రసాద్‌రావును రూరల్ ఏసీపీ తిరపతిరెడ్డిని, ఎస్బీ ఏసీపీ సాంబరాజును కలిశారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	46 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	50
బీరకాయ	68
పచ్చిమిర్చి	36
కాకరకాయ	38
బెండకాయ	28
పొట్లకాయ	38
దోసకాయ	28-58
చిక్కుడు	70
నాటుచిక్కుడు	120
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	38
దొండ	30-38
సొరకాయ	28
క్యారెట్	78
క్యాప్సికం	58
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	175
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మట్కా
కేపీఎస్:	కంగువ
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	క

ఆయనపై అంత ప్రేమెందుకో?

» గతంలో ఆరోపణలతో సెక్షన్ మార్చిన అధికారులు
» కెఎంసీలో అంతర్గత బదిలీల్లో మళ్లీ పాత సెక్షన్‌కే
» నెలరోజుల క్రితం అధికారిపై విచారణకు విజిలెన్స్ లేఖ

ఖమ్మం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం కొందరు అధికారులకు కీలక విభాగాల్లో మార్పులు చేశారు. అయితే గతంలో ఓ విభాగంలో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొని సెక్షన్ మార్చబడిన ఓ అధికారికి తిరిగి అదే విభాగాన్ని కేటాయించారు. ఇది పలు విమర్శలకు దారి తీస్తోంది. కార్పొరేషన్ పరిధిలో ఇంటి నెంబర్ల కేటాయింపుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. ప్రభుత్వ భూముల నుంచి మొదలుకుని వేరేవారి పేరు మీద ఉన్న అసైన్‌మెంట్ భూములకు, ఎకరాల్లో ఉన్న స్థలాలకు సైతం ఎలాంటి నిర్మాణాలు లేకపోయినప్పటికీ దొంగ అసెస్‌మెంట్లు వేసి అప్పనంగా ప్రభుత్వ భూములు కట్టబెట్టారు. తీరా విషయం వెలుగులోకి రావడంతో ఒక్క యేడాదిలో జరిగిన అసెస్‌మెంట్లపై విచారణ జరిపి అధికారికంగా ఏడుగురిపై కేసు నమోదు చేయించారు. అయితే ఆ సమయంలో గతంలో కమిషనర్‌గా పనిచేసిన ఆదర్శ్ సురభి సంబంధిత అసెస్‌మెంట్లకు బాధ్యులైన పలువురి అధికారులను సెక్షన్ మార్చారు. ఆ తర్వాత నగరంలోని 58, 59 జీవో లో జరిగిన అక్రమాల్లో సైతం దొంగ అసెస్‌మెంట్లే కీలకంగా మారాయన్న విషయం కూడా బహిర్గతం అయింది. తొలుత దొంగ అసెస్‌మెంట్లు వేయగా.. ఆ తర్వాత ఆ వ్యవహారం వెలుగులోకి రావడంతో వాటిని గుట్టుచప్పుడు కాకుండా డీయాక్టివేట్ చేశారు. దాంతో 59 జీవో స్థలాల క్రమబద్ధీకరణలో కొందరు వ్యక్తులు ఎన్నెస్పీ, ప్రభుత్వ భూములకు ఎలాంటి నిర్మాణాలు లేకుండానే భూములను అక్రమంగా క్రమబద్ధీకరించుకున్న విషయం తేలింది. కాగా ఆంధ్రజ్యోతి ప్రధాన, జిల్లా సంచికల్లో వార్తాకథనాలు ప్రచురించి ఆయా అక్రమాలను వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. సరిగ్గా నెల రోజుల క్రితం అక్రమాల విషయంపై విచారణ జరపాలంటూ విజిలెన్స్ రీజనల్ కార్యాలయం నుంచి కేఎంసీకి లేఖ కూడా వచ్చింది. లేఖలో నలుగురు పేర్లు ప్రస్తావించగా.. అందులో సదరు అధికారి పేరు కూడా ఉండటం గమనార్హం. ఆ లేఖ అందిన వెంటనే యాక్షన్ టేకెన్ రిపోర్టు సమర్పించాలని కార్పొరేషన్ అధికారులకు విజిలెన్స్ అధికారులు సూచించారు. ఐనా నేటి వరకు దానిపై ఎలాంటి విచారణ మొదలుపెట్టకపోగా.. తిరిగి అదే అధికారికి కీలక బాధ్యతలు అప్పగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఆ లేఖను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన సెక్షన్‌లో ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటూ విభాగం మార్చబడిన అధికారే ఉండటంతో కావాలనే లేఖను దాచి ఉంచారన్న ఆరోపణలు లేకపోలేదు.

ఎండుతున్న ఆశలు


» భారీ వర్షాలతో ఎదుగుదల లోపించిన పత్తి
» చీడపీడలతో తగ్గిన దిగుబడి
» అన్నదాత కుదేలు



ఎదుగుదల లోపించిన పత్తి చేను

తిరుమలాయపాలెం,నవంబరు21(ఆంధ్రజ్యోతి): తెల్లబంగారం అని మురిసిపోతూ పత్తి పంట సాగుచేసిన రైతు వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పుడు తెల్లబోతున్నాడు. వాతావరణం అనుకూలిస్తుందనే ఆశతో అందినకాడికి అప్పులు తెచ్చి పంట వేసిన అన్నదాత ఇప్పుడు వాటిని తీర్చలేక అప్పులు ఊబిలోకి కూరుకుపోతున్నాడు. మూడేళ్లుగా పత్తి సాగు ఆశాజనకంగా ఉండడంతో ఈసారి సాగుపట్ల ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపారు. ఈక్రమంలో ఈ ఏడాది మండలంలో సుమారు 13500 ఎకరాల్లో పత్తిసాగు చేశారు. అయితే ఈఏడాది పత్తిసాగు మొదటినుంచి వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. విత్తనాలు నాటే సమయంలో సరైన వర్షాలు లేక మూడుసార్లు విత్తనాటు నాటినా మొలకెత్తలేదు. దీంతో రైతులు ఆలస్యమైనా సాగుచేశారు. వేలాదిరూపాయలు పెట్టుబడులు పెట్టారు. ఈఏడాది కురిసిన భారీవర్షాలతో పత్తి చేలు ఆశించినస్థాయిలో దిగుబడిరాలేదు. ఎకరానికి 4క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వేలాది రూపాయలు తెచ్చిపెట్టుబడులు పెట్టినా పైసా ఆదాయం కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి విలవిల్లాడుతున్నారు. పండించిన పంట కూడా మార్కెట్‌లో గిట్టుబాటు ధర రావడంలేదు వచ్చిన పంటను నిలవ చేసుకోలేక మార్కెట్‌లో అమ్మలేక లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం పత్తికి మద్దతు ధర ఇస్తున్నట్లు ప్రకటించినప్పటికి ఆచరణలో సాధ్యం కావడంలేదు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా అక్కడ సీసీఐ కొర్రీలు పెట్టడంతో పంట నష్టపోలేక ప్రైవేటు వ్యాపారస్తులకు తక్కువ ధరకు అమ్ముకుంటూ తీవ్రగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు
నూకల రంగారెడ్డి, రైతు



ఈ ఏడాది పత్తిసాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఆరు ఎకరాల్లోపత్తి వేశాను. అధిక వర్షంతో ఎకరానికి4.5 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితిలేదు. మార్కెట్‌లో మద్దతు ధర కూడా లేదు. తీవ్రంగా నష్టపోయాం.

వైద్యశాఖ లక్ష్యాలను సాధించాలి

» జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖ నిర్దేశించిన అన్ని లక్ష్యాలను సాధించాలని, దీనికోసం మెడికల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళావతిభాయి సూచించారు. గురువారం అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో అసంక్రమణ వ్యాధులనమోదు, ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేసిన అంశాలపై ఆమె సమీక్షించారు. అర్బన్‌లో స్క్రీనింగ్, ఫాలోఅప్, అభాజెనరేషన్లు తక్కువగా నమోదు అవుతున్నాయని అసంతృప్తిని వ్యక్తం చేశారు. మాతా శిశు సంక్షేమం, వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమంలో కోల్డ్ చైన్, మెయింటైన్, ఎంసీపీ కార్డ్ నింపటం, చేసిన సేవలు అప్డేషన్ లాంటివి సూపర్ వైజర్లు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు. మెడికల్ లక్ష్యాలు సాధించాలని ప్రధానంగా అభాజనరేషన్ల పై వైద్యులు దృష్టి సాధించాలని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ సత్యేంద్రనాథ్ తెలిపారు. అనంతరం మంచుకొండ పీహెచ్‌సీ వైద్యులు సిబ్బందితో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చందునాయక్ సూపరవైజర్లకు సబ్‌సెంటర్‌లను విభజించి వాటిలో జరిగే అన్ని కార్యక్రమాల అమలు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు, డెమో సాంబశివరెడ్డి, హెచ్‌ఈవో సత్యనారాయణ, హెచ్‌ఈ మురళి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ప్రజల్లో ఆదరణ తగ్గలేదు

ఖమ్మంమామిళ్లగూడెం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం పార్టీకి ప్రజల్లో ఆదరణ చెక్కుచెదరలేదని టీడీపీ నాయకులు పీఏసీఎస్ మాజీ చైర్మన్ గడిపూడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, సీనియర్ రాజకీయ నాయకుడు నంజాల రవి కుమార్‌కి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్, గడిపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, ఖమ్మం జిల్లా నాయకులు నాగార్జున శ్రీనివాస్, పాలడుగు కృష్ణ ప్రసాద్, రాయల కోటేశ్వరరావు, చావారామారావు మల్లెంపాటి లహరిన్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ రెవెన్యూ విభాగం బలోపేతం

» మరో ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నియామకం

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో రెవెన్యూ విభాగం బలోపేతానికి కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలను చేపట్టారు. స్థిర ఆస్తుల కొలతలు, లెక్కల నుంచి ఆదాయ వసూళ్ల వరకు రెవెన్యూ విభాగం పర్యవేక్షణలో కొనసాగుతోంది. అయితే ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ఆర్వో శ్రీనివాసరావు, మేనేజరు విజయానంద్‌కు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విజయానంద్ పదోన్నతి జాబితాలో ఉన్నారు. దీంతో ఆయన కమిషనర్‌గా వెళ్లేందుకు అవకాశాలు ఉన్నాయి. వీరితో పాటుగా జ్యోతి,రామారావు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పని చేస్తున్నారు. ఈక్రమంలో కేఎంసీలో సీనియర్ అసిస్టెంట్‌లుగా ఉన్న సుధాకర్, శ్రీనివాసరావులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా నియమించేందుకు దస్త్రం సిద్ధం చేసినట్లు సమాచారం.

మత్స్యకారులకు ఆసరా పింఛన్ అందించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్,నవంబరు21(ఆంధ్రజ్యోతి):మత్స్యకారులకు ఆసరా పింఛన్ అందించాలని జిల్లా గంగపుత్రసంఘం అధ్యక్షుడు కన్నం ప్రసన్నకృష్ణ అన్నారు. ప్రపంచ మత్స్యదినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జిల్లా మత్స్యశాఖ అధికారి శివ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. మత్స్యకారులకు ఆసరా పింఛన్ అందించాలని, సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా బెస్త సంఘం ప్రధాన కార్యదర్శి దేశబోయిన మంగారావు,కోశాధికారి పెద్దపల్లి సుధాకర్‌పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాల వేలం నేడు

నేలకొండపల్లి, నవంబరు21(ఆంధ్రజ్యోతి):దాడుల్లో పట్టుబడిన రెండు ట్రాలీ ఆటోలను శుక్రవారం ఉదయం నేలకొండపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ జగన్నాధరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 50శాతం డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సీఐ జగన్నాధరావు పేర్కొన్నారు.

24 నుంచి మహారుద్రయాగం

ఖమ్మంసాంస్కృతికం,నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఈనెల24 నుంచి 29వ తేదీ వరకు ఖమ్మంలో సహస్రచండీ సహిత మహారుద్రయాగాలు జరుగనున్నాయి. మమతారోడ్‌లోని భవ్యశ్రీ వృద్ధాశ్రమం, జ్యోతిష్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యగశాలవద్ద రోజూ ఉదయం సాయంత్రం వేళల్లో జరుగునున్నాయి. రాజోలు భానురవి కిరణశర్మ ఆధ్వర్యంలో కొనసాగే ఈయాగాల్లో రోజూ 163 జంటలు పాల్గొంటాయి.

24న నెలనెల వెన్నెల

ఖమ్మంసాంస్కృతికం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతీ నెలా నిర్వహించే నెల నెల వెన్నెల కార్యక్రమం ఈనెల 24న జరుగనుంది. కార్యక్రమంలో భాగంగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు కళాకారులు చిగురు మేఘం నాటికను ప్రదర్శించనున్నారు. కావూరి సత్యనారాయణ రచించిన ఈ నాటికకు ఏపూరి హరిబాబు దర్శకత్వం వహిస్తారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 50వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్ శంకుస్థాపనలు చేశారు. ఈఈ కృష్ణలాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖమ్మంనగరంలోని పలు డివిజన్లలో లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి, కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

తిరుమలాయపాలెం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి):రైతుసంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తోందని జిల్లా కాంగ్రెస్ నాయకులు పోట్ల రమేష్ తెలిపారు. గురువారం మండలంలోని తిమ్మక్కపేటలో కాంగ్రెస్ జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకేసారి రుణమాఫీ చేసిన ఘతన కాంగ్రెస్‌దేనన్నారు. నేడు రైతులపై బీఆర్ఎస్ నేతలు ప్రేమ చూపుతున్నారన్నారు. ఈ సమావేశంలో మాజీసర్పంచ్ సంద్ర వెంకన్న, చుంచు రాములు, వాలూరి రాము పాల్గొన్నారు.

వన సమారాధనను విజయవంతం చేయాలి
మేకల మల్లిబాబు యాదవ్

నేలకొండపల్లి, నవంబరు21(ఆంధ్రజ్యోతి):24 ఆదివారం ఖమ్మంలో జరుగనున్న జిల్లా యాదవ వన సమారాధనను విజయవంతం చేయాలని యాదవ కార్తీక వనసమారాధన గౌరవాధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్ పిలుపునిచ్చారు. గురువారం నేలకొండపల్లి వచ్చిన మల్లిబాబు యాదవ్ మన్నె కృష్ణారావుయాదవ్ ఇంటి వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మన్నె కృష్ణయాదవ్, కూరాకుల నాగేశ్వరరావుయాదవ్, మన్నె కోటేశ్వరరావుయాదవ్, గొలుసు రవియాదవ్, మన్నె శ్రీనుయాదవ్ పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక వనసమారాధనను విజయవంతం చేయాలని యాదవ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు, జిల్లా అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు కోరారు. వెంకటగిరిలో కార్యక్రమపోస్టర్‌ను గురువారం పలువురు నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

» లగచర్ల రైతులకు మద్దతుగా టీయూసీఐ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రామయ్య

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న వామపక్ష పార్టీల నాయకులను అక్రమంగా అరెస్టులు చేయటం అప్రజాస్వామికమని టీయూసీఐ(ఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య ఖండించారు. కార్పొరేట్ శక్తుల కోసం ప్రభుత్వాలు పనిచేయటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. టీయూసీఐ ఆధ్వర్యంలో లగచర్ల రైతులకు మద్దతుగా గురువారం ర్యాలీ నిర్వహించారు. సారవంతమైన భూముల్ని ఫార్మ కంపెనీలకు అప్పగించటం వ్యవసాయరంగాన్ని దెబ్బతీయటమే అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయ, బొమ్మకంటి రమేశ్,కాడారి శ్రీనివాస్, దాసు, బానోత్ రవి, రమేశ్, తిరుపయ్య, శోభన్, సురేశ్ పాల్గొన్నారు.

రైతులపై నిర్బంధాన్ని నిలిపి వేయాలి

ఖమ్మంటౌన్: వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మాకంపెనీ కోసం భూములు సేకరించేందుకు రైతులపై నిర్బంధకాండను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జెడ్పీసెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజనసంఘం, అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం,కేవీపీఎస్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు బొంతు రాంబాబు,మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం, మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్ మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయకుండా బలవంతంగా లగచర్లలో ఫార్మాసిటీ కోసం బలవంతంగా భూసేకరణ చేయటం సరికాదన్నారు. బలవంతపు భూసేకరణను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు మాదినేని రమేష్, ఎస్. నవీన్‌రెడ్డి,ఎస్కే. హిమాం, వరప్రసాద్‌చ మెరుగు వెంకటరమణ,మెహ్రున్నీసా బేగం, లమరావతి, అజిత, భూక్యా శ్రీను, ఎర్రా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి

ఖమ్మంరూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని పీవైఎల్ డివిజన్ కార్యదర్శి మామిడాల వెంకటేష్ అన్నారు. మండల పరిధిలోని పోలిశెట్టిగూడెం గ్రామంలో గురువారం పీవైఎల్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగయ్య, వీరస్వామి, సీతారాములు, నజీర్, మహేష్, వెంకట్రావు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలెక్షన్స్‌లో 46 మంది ఎంపిక

ఖమ్మంఖానాపురంహవేలినవంబరు21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 46 మంది అకాడమర్, టీచ్ నూక్ కంపెనీలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎన్నికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మూడు నెలల శిక్షణలో నెలకు రూ.20వేల స్టైఫండ్ అందిస్తారని తెలిపారు.

త్రిపుర బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో న్యూఇరా విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు21 (ఆంధ్రజ్యోతి): త్రిపుర బుక్ ఆఫ్ రికార్డ్సులో నగరంలోని న్యూఇరా పాఠశాల విద్యార్థులు స్థానం పొందారని పాఠశాల చైర్మన్ ఐవీ. రమణారావు, డైరెక్టర్ పీ.భూమేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ ఎన్టీఆర్ ఆడిటోరియంలో విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడెమీ ఆధ్వర్యంలో కార్తీకమాసం సందర్భంగా బుధవారం నృత్య మహోత్సవం నిర్వహించారు. పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థిని మన్విత రెడ్డి, 5వ తరగతికి చెందిన భవిష్యవర్ధిని ప్రతిభ కనబరిచి త్రిపుర బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సాధించారని తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ రమణారావు

నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర ముఖ్యం

» నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్



మాట్లాడుతున్న నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్

నేలకొండపల్లి,నవంబరు21(ఆంధ్రజ్యోతి): నేరపరిశోధనలో, అరికట్టటంలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమైనదని నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ అన్నారు. గురువారం సాయంత్రం నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో గ్రామస్తులు, వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు.దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా నేరాలు జరిగినప్పుడు సీసీ కెమేరాలుంటే దొంగలను పట్టుకోవటం సులువవుతుందన్నారు. మిస్సింగ్, కిడ్నాప్ కేసుల్లో సైతం సీసీకెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.ప్రతీషాపులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో మన్నె కృష్ణారావు, కొత్తా రమేష్, ఏటుకూరి రామారావు, రేగూరి హనుమంతరావు, సీతారాములు, నంచర్ల దేవీప్రసాద్, గెల్లా పవన్, బచ్చలకూరి నాగరాజు పాల్గొన్నారు.

28న జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఈనెల28న జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యుడు శివన్నారాయణ తెలిపారు. గురువారం నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాలలో నగరస్థాయి టెస్ట్ నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు ఎంపికైనట్లు చెప్పారు. ఇప్పటికే మండలస్థాయిలో ఎంపికలు పూర్తి చేశామన్నారు.

గీతాంజలి విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి: నగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో గీతాంజలి పాఠశాల విద్యార్థులు జీ.వేదశ్రీ, పీ. నవదీప్, పీ.చరణ్ జోన్2 లో ప్రథమ బహుమతి సాధించారని పాఠశాల డైరెక్టర్లు టీవీ. అప్పారావు, టీ. పద్మ, అరుణ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

» లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మురళీధర్‌రావు

కూసుమంచి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మురళీధర్‌రావు తెలిపారు. గురువారం కూసుమంచి, చేగొమ్మ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.20వేల విలువైన క్రీడాసామగ్రి అందజేశారు. ఈసందర్భంగా యువ సాధికారత అనేఅంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ మదన్ మోహన్, ప్రెసిడెంట్ డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత రంగాల్లోకి స్థిరపడిన అనంతరం ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు గెల్లా శ్రీరామ్, వీ.వెంకయ్య, హెచ్‌ఎం రేల విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

రఘునాథపాలెం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెంలో పదిమంది లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో మంజూరు జరిగిన ముఖ్యమంత్రి సహాయనిధి, కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను గురువారం రఘునాథపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. గుడిపూడి రామారావు, తాతా రఘురాం, రెంటాల ప్రసాద్, మందా బుచ్చిబాబు, నంద్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన బుర్ర సుజాతకు మంజూరైన రూ.30వేల చెక్కును సీపీఎం జిల్లా నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు గురువారం అందజేశారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సిఫారసుతో మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, రాజశేఖర్, రంజాన్ పాషా, మల్సూర్, లింగస్వామి పాల్గొన్నారు.



కల్లూరు డివిజన్‌లో 80 శాతం సర్వే పూర్తి: ఆర్డీవో



కల్లూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కల్లూరు డివిజన్ పరిధిలో సమగ్ర సర్వే 80 శాతం పూర్తైందని ఆర్డీవో రాజేంద్రగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పెనుబల్లి మండలం లో 18,366 కుటుంబాలు ఉండగా 74 శాతం సర్వే పూర్తి కాగా, సత్తుపల్లిలో 27,427 కుటుంబాలు ఉండగా 86 శాతం, కల్లూరు మండలంలో 23,600 కుటుంబాలు ఉండగా, 77 శాతం, తల్లాడ మండలంలో 18,697 కుటుంబాలకు గాను 76 శాతం, వేంసూరు మండలంలో 15,694 కుటుంబాలు ఉండగా 89.73 శాతం సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ నెల 25 తేదీ నాటికి 100 శాతం సర్వే పూర్తి చేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

యువత మత్తు పదార్థాలకు బానిసకావొద్దు

» జిల్లా న్యాయ సేవాధికారసంస్థ జడ్జీ చంద్రశేఖర్



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జీ చంద్రశేఖర్‌రావు

కొణిజర్ల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాల వంటి చెడు అలవాట్లకు బానిసకావొద్దని, వాటి వలన జీవితమే నాశనం అవుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జడ్జీ కె.వి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. మండల పరిధిలోని చిన్నగోపతి గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదుస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత మంచి మార్గంలో నడవాలని, చెడు వ్యసనాలకు బానిసలై జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్ కోయిన్ని శంకర్‌రావు, మాజీ సర్పంచ్ పొట్లపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బూర ప్రసాద్‌రావు, పగడాల నగేష్ తదితరులున్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి పృథ్వీరాజ్‌నాయక్

మధిరరూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గ్రామంలో దెందుకూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్ మాట్లాడుతూ రెండువారాలకు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, జ్వరం రావడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది సందీప్, కొండయ్య, విజయకుమారి పాల్గొన్నారు.

పత్తి రైతుల అవస్థలు

» సీసీఐ కేంద్రాల్లో దక్కని మద్దతు ధర » నిబంధనల పేరుతో రైతులు తీసుకువచ్చిన పత్తి తిరస్కరణ



సీసీఐ కేంద్రంలో పత్తిని చూపిస్తున్న రైతులు

మధిరరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సీసీఐ నిబంధనలతో మద్దతు ధర దక్కక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధిర మండలం మాటూరు వద్దగల మంజిత్ కాటన్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో రైతులు తమ పత్తిని అమ్ముకొనేందుకు తీసుకువచ్చి తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిన్నామొన్నటి వరకు తేమశాతం తక్కువ ఉందంటూ పత్తిని తీసుకోని సీసీఐ పత్తిలో నలక, ఆకు ఉందంటూ సీసీఐకి వచ్చిన పత్తిని కొనుగోలు చేయడం లేదు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు గురువారం మంజిత్ కాటన్ జిన్నింగ్ మిల్లులోని సీసీఐ కేంద్రానికి పత్తిని అమ్ముకొనేందుకు తీసుకువచ్చారు. ఏలూరు రమేష్ అనే రైతు తాను పండించిన 35క్వింటాళ్ల పత్తిని జిన్నింగ్ మిల్లు కు తీసుకువచ్చాడు. తేమశాతం సక్రమంగానే ఉంది. అయితే ఆకు, నలక ఉందనే కారణంతో ఈ రైతు పత్తిని సీసీఐ బయ్యర్ తిరస్కరించారు. దీంతో రైతు లబోదిబోమంటున్నాడు. అలాగే ఇదే గ్రామానికి చెందిన చెరుకూరి జనార్థన్ అనే రైతు పత్తిని కూడా ఇదే సాకుతో తిరస్కరించారు. దీంతో రైతులు సీసీఐ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తూ ఆందోళన చెందుతున్నారు. అసలే ఈ సంవత్సరం అధిక వర్షాలు కురిసి పత్తి దిగుబడి లేదని, వచ్చిన కొద్ది పత్తిని కూ డా సీసీఐ కేంద్రాల్లో నిబంధనల పేరుతో వెనక కు పంపిస్తుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

రైతులు ఈ విషయమై మార్కెట్ కమిటీ సెక్రటరీ చంద్రశేఖర్, వ్యవసాయ అధికారులకు రైతులు ఫోన్లో సమస్యను తెలపడంతో వారు సీసీఐ కేంద్రానికి చేరుకున్నారు. రైతులు తమ సమస్యను వారికి విన్నవించారు. మూడు వాహనాల్లో పత్తిని తీసుకువచ్చామని, పత్తిని సీసీఐ కేంద్రంలో కూడా ఉంచిన తర్వాత నిబంధనల పేరుతో తిరస్కరించడం సరైంది కాదని రైతులు అధికారుల ఎదుట ఆవేదన వెలిబుచ్చారు. మొత్తం మీద మూడు సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ రైతుకు న్యాయం జరగకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మార్కెట్ కమిటీ అధికారులు స్పందించి పత్తిను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కేంద్రంలో పడిగాపులు కాస్తున్నాం

● ఏలూరు రమేష్, రైతు, బ్రాహ్మణపల్లి



15ఎకరాల్లో పత్తి పంట వేశాను. 35క్వింటాళ్ల పత్తిని సీసీఐకి తీసుకువస్తే నిబంధనల పేరుతో తిరస్కరిస్తున్నారు. ఇది సరైంది కాదు. పత్తి రైతులను ఆదుకోవడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమైంది. షరతులు లేకుండా పత్తిని కొనుగోలు చేసి తమను ఆదుకోవాలి.

డిజిటల్ విధానంలో బోధన సులభతరం

» కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

చింతకాని, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): డిజిటల్ విధానంలో బోధనను విద్యార్థులు తేలికగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పందిళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులను తిరుగుతూ, విద్యా బోధన ప్రక్రియను పరిశీలించారు. ఆరవ తరగతి గదిలో విద్యార్థులతో కలసి ఇంగ్లీష్ పాఠాన్ని విన్నారు. డిజిటల్ ల్యాబ్‌ను సందర్శించి డిజిటల్ క్లాస్‌ను వీక్షించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠశాలలో బోధన విధానం, సమస్యలు తెలుసుకున్నారు. జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా విద్యార్థులు ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని సూచించారు. చదువు ఉంటేనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ వాలంటీర్స్ శ్రీనివాస్, రాహుల్, కన్నెబోయిన సీతారామయ్య, కంచం వంశీ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడిగా నర్సింహాచారి

తల్లాడ, నవంబరు21(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణసంఘం తల్లాడ మండల అధ్యక్షుడిగా రుద్రాక్ష నర్సింహచారి ఎన్నికయ్యారు. గురువారం తల్లాడలో సంఘం వ్యవస్థాపకుడు బాజోజు శేషభూషణం అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్ర ధాన కార్యదర్శిగా తాటికొండ కృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఇందోజు రవి, కోశాధికారిగా గంటల వెంకటాచారి, సంయుక్త కార్యదర్శిగా రుద్రాక్ష బ్రహ్మం, గౌరవ సలహాదారులుగా ఇందోజు బ్రహ్మయ్య, బండారు వీరబ్రహ్మాచారి, ఉలి శ్రీనివాసరావు, మహిళా అధ్యక్ష, కార్యదర్శులుగా తాటికొండ పద్మావతి, సునీతలను ఎన్నుకున్నారు.

నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

కొణిజర్ల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని ఎటువంటి నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. గురువారం కొణిజర్లలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళారీలు రైతులను మోసం చేస్తున్నారని, ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం, తాళ్ళపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, తాతా పద్మ, దొడ్డపునేని కృష్ణార్జునరావు, బొడ్డుపల్లి వీరభద్రం, ధారగాని రాములు, వెంకటేశ్వర్లు, అఫ్జల్, సరోజిని, దానయ్య, వెంకటేశ్వర్లు, అంజయ్య, హరిచందు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

వైరా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం విశిష్ట ఫౌండేషన్ నిర్వాహకులు గుర్రం సీత, సుప్రియలు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.మాధవరావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అనితాదేవి, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, పెనుగొండ ఉపేంద్రరావు, ఆర్యవైశ్య సంఘం మండల కార్యదర్శి కొల్లా రాంబాబు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

'ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తాం'



మల్లవరంలో సీపీఐ సభ్యత్వ నమోదును అందజేస్తున్న ప్రసాద్

మధిరరూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతర పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. మండలం మల్లవరం గ్రామంలో గురువారం సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించా రు. గ్రామంలో తొలి సభ్యత్వాన్ని మందడపు వెంకయ్య మంగమ్మలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పార్టీ కార్యకర్తలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, తోట రామాంజనేయులు, మందడపు రాణి, ఏనుగు గాంధీ, మందడపు నాగకృష్ణ, మచ్చా పద్మా, మందడపు పుల్లయ్య పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె




తండ్రి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె ఏసుమణి

మధిరరూరల్/మధిర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లిలో ఓ కుమార్తె తన తండ్రి అంత్యక్రియలు నిర్వహించి తండ్రి రుణం తీర్చుకుంది. మడుపల్లి గ్రామంలో గుండాల ఏడుకొండలు(64)కు ముగ్గురు కుమార్తెలున్నారు. వీరి ముగ్గురికి వివాహమైంది. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఏడుకొండలు గురువారం మృతిచెందాడు. కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తె ఏసుమణి అంత్యక్రియలు నిర్వహించింది. తన చెల్లెలు వెంకటరమణ, ఉషారాణి కూడా అంత్యక్రియల్లో తన వెంట నడిచారు.

మున్నేటిలో గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం

చింతకాని, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తిమ్మినేనిపాలెం గ్రామంలో మున్నేటిలో బుధవారం చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన కొమ్ము మహేందర్(55) మృతదేహాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. ఘటన ప్రాంతానికి కొద్ది దూరంలో నీటిపై తేలిఆడుతుండగా ఒడ్డుకు చేర్చి, పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపల దొంగ చిక్కేనా..?



బస్వాపురం చెరువులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

చింతకాని, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బస్వాపురం పెద్దచెరువులో మత్స్యకారులు మూడు నెలల క్రితం చేపలను విడుదల చేశారు. ప్రస్తుతం చేప అరకిలో సైజుకు పెరిగింది. చెరువులోని చేపలను ఎవరూ దొంగతనం చేయకుండా ఉండేందుకు మత్స్యకారులు కాపలాగా చెరువులో సీసీ కెమేరాను ఏర్పాటు చేశారు. అటుగా వెళ్లే వారు సీసీ కెమెరాను చెరువులో చూసి ఆశ్చర్యపోతున్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

ఏన్కూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లొడ్డు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.50వేల విలువైన బ్యాగులను, నోటు పుస్తకాలను సీపీఐ సీనియర్ నాయకుడు తాళ్లూరి చలపతిరావు వితరణగా అందించారు. చలపతిరావు మనుమరాలు నైష్మిత పుట్టిన రోజు వేడుకలు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు కేక్‌కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం మాదవి, మాజీ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, సీపీఐ నాయకులు జాగర్లముడి రంజిత్‌కుమార్, తెప్పల సత్యం, అమరనేని వీరభద్రం, తాళ్లూరి రమణారావు, మాదినేని వెంకన్న పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బ్యాంకుల వద్ద భద్రత కలిగి ఉండాలి: ఎస్‌ఐ



బ్యాంకు అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ షాకీర్

కల్లూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలో గల పలు బ్యాంకుల ఏటీఎం పరిసరాల ప్రాంగణంలో భద్రతను ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ యస్‌కె షాకీర్ సూచించారు. గురువారం ఆయన తన సిబ్బందితో కలసి పలు బ్యాంకులను సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇటీవల కాలంలో బ్యాంకుల్లో దొంగతనాలకు గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వస్తుందన్నారు. వరంగల్ జిల్లా రాయపర్తిలో ఓ బ్యాంకులో రూ. 13.30 లక్షల వరకు బంగారం చోరీ అయిందని తెలిపారు. దీంతో బ్యాంకు అధికారులు సీసీ పుటేజీలు, అలారమ్‌లు సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకు అధికారులకు సూచించారు. పాఠశాలల, కళాశాలల సమయంలో విద్యార్థుల పట్ల ర్యాగింగ్ పాల్పడిన వారి గురించి సమాచారం అందించాలని, 100 డయల్‌కు కాల్ చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించి చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుందని ఎస్‌ఐ తెలిపారు. నకిలి విలేకరుల పేరుతో బెదిరింపులకు పాల్పడిన వారిపై సమాచారం అందిస్తే వారిపై కూడాచర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆయన వెంట బ్యాంక్ సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

కాకతీయ షుగర్స్ క్రషింగ్ ప్రారంభం



ప్లాంట్ స్విచ్ ఆన్ చేసి క్రషింగ్‌ను ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

కల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని కాకతీయ షుగర్ ఫ్యాక్టరీలో గురువారం క్రషింగ్ సీజన్‌ను ప్రారంభమైంది. వైస్‌చైర్మన్ చల్లగుల్ల నాగేశ్వరరావు ప్లాంట్ స్విచ్‌ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024-2025 సీజన్‌కు గాను ఫ్యాక్టరీ పరిధిలో 60 వేల టన్నుల చెరుకును క్రషింగ్‌గా ఆడించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సంత్సవరం చెరుకు మద్దతు ధర టన్నుకు రూ.3,200 ప్రకటించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ కస్తాల నరేంద్ర, ప్లాంట్ ఇంజనీర్ కొడాలి రఘునాథబాబు, కెన్‌అడ్వైజర్ నరిసింహామూర్తి, ఫ్యాక్టరీ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పూసలపాడులో కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గాలి శ్రీనివాసరావు

వైరా, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూసలపాడు సొసైటీలో అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సన్నరకం ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన రూ.500బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏఈవో కీర్తి, మాజీ ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వరరావు(బుజ్జీ), కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు చింతనిప్పు మాధవరావు, సొసైటీ ఉపాధ్యక్షుడు గారపాటి గోపాలరావు, సీఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కల్లూరులో విజేతలకు బహుమతులు పొందిన విద్యార్థులు



కొణిజర్లలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మధిర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మధిర మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పరీక్షను గురువారం మధిర సీపీఎస్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం డేవిడ్‌రాజు, భీమరాజు, వేదిక అధ్యక్ష, కార్యదర్శులు ధనిశెట్టి బాస్కర్‌రావు, ఏ రవి పాల్గొన్నారు.

కొణిజర్ల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి ప్రతిభ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షను మండల విద్యాశాఖాధికారి అబ్రహం ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శాంతకుమార్, హనుమ, రంజాన్, రవి, వాసు తదితరులున్నారు.

వైరా, నవంబరు21(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం వైరాలోని ప్రభుత్వ హైస్కూల్లో మండలస్థాయి చెకుముకి టాలెంట్‌టెస్టు నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మాధవరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు మల్లెంపాటి వీరభద్రరావు టాలెంట్‌టెస్టు ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. జి.వెంకట్రావ్, బి.రామకృష్ణ, యాకోబు, సమీన్, కృష్ణారావు, అనంతలక్ష్మీ, రమేష్ తదితరులున్నారు.

చింతకాని, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్ష చింతకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. విజేతలను ఎంఈవో శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక మండల బాధ్యులు ప్రవీణ్, రాజయ్య, సీతరామయ్య అభినందించారు.

కల్లూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): కల్లూరులో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో చెకుముకి పరీక్షలు నిర్వహించారు. మండల యూటీఎఫ్ శాఖ తరుపున విజయ్‌కుమార్, చక్రవర్తిలు, విజ్ఞాన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యస్‌కె ఇస్మాయిల్ విద్యార్థులకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం రహీం, ప్రోగాం కోఆర్డినేటర్స్ గుర్రాల సుధీర్‌బాబు, వేముల శ్రీనివాస్, అలెగ్జాండర్ పాల్గొన్నారు.



వైరాలో..



మధిరలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



చింతకానిలో...

'వరికొయ్యలను కాల్చొద్దు'



వరికోత పొలాలను పరిశీలిస్తున్న ఏఈవో

ఏన్కూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): వరికోత తర్వాత వరి కొయ్యలను కాల్చొద్దని ఏవో ఏ.నరసింహారావు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రా మాల్లో పంట పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరికొయ్యలను కాల్చడం వల్ల మట్టిలోని సూక్ష్మజీవులు దెబ్బతిని నేల సంతులనం కోల్పోతుందన్నారు. వరి పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలయదున్నడం వల్ల భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు లహరి, నవయ రైతులు పాల్గొన్నారు.

తల్లాడ, నవంబరు21(ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలను కాల్చకుండా వాతావరణం, భూసారాన్ని పరిరక్షించాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ.తాజుద్దీన్ కోరారు. గురువారం మండలంలోని నూతనకల్, మిట్టపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట పలువురు రైతులు ఉన్నారు.